సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
శుక్రవారం, 02.10.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 332
పేజీలు: 08 వెల: రూ. 5

స్థానిక ఎన్నికలకు

## లైన్ క్లియర్

ఆరు వారాల్లో స్థానిక పోరు



- ఆ లోపు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలి
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల జీవోల కొట్టివేత
- ఎన్నికల సంఘానికి ఏపీ హైకోర్టు ఆదేశాలు

02

కెప్టెన్ స్మిత్ మచ్చర్

## ఎయిర్ లిఫ్ట్

మెరుగైన చికిత్స కోసం
సౌదీ నుంచి దుబాయ్‌కి

02



మొబైల్ రీఛార్జ్‌తో

## ₹లక్ష బీమా

02




- కళ్లు చెదిరే న్యూస్ చెప్పిన బీఎస్ఎన్ఎల్
- సైబర్ మోసాలకు రూ.10 వేల కవరేజీ!
- బీఎస్ఎన్ఎల్ రెండు ప్లాన్లపై ఫ్రీ ఇన్సూరెన్స్
- ప్రీమియం లేకుండానే బీమా ప్రయోజనం
- అక్టోబర్ 1 నుంచే ఇన్సూరెన్స్ ఆఫర్

టార్గెట్

- 'దొరతనం' ముద్రతో బీఆర్ఎస్‌కు కొత్త చిక్కులు..
- సొంత శ్రేణుల్లోనూ అసంతృప్తి

# కేటీఆర్

## ఆత్మవిశ్వాసమా? అతివిశ్వాసమా?

- కేటీఆర్ ఇమేజ్‌పై సోషల్ మీడియా ఫైర్
- ప్రతిపక్షంలోనూ మారని తీరు?
- కేటీఆర్‌కు ఇమేజ్ మేకోవర్ తప్పదా?
- కార్యకర్తలతో మరింత మమేకం కావాలంటూ సూచనలు
- వినమ్రత పెంచుకోవాలంటున్న రాజకీయ వర్గాలు
- కేటీఆర్ తీరే బీఆర్ఎస్‌కు మైనస్‌గా మారుతోందా?

**ముద్ర, తెలంగాణ బ్యూరో**
ప్రజాస్వామ్య రాజకీయాల్లో నాయకుడి పనితీరుతో పాటు ప్రజల్లో అతనికి ఉన్న ఇమేజ్ కూడా కీలకమే. ముఖ్యంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలతో వినమ్రంగా మెలగడం, కార్యకర్తల మాట వినడం, ప్రజాభిప్రాయాన్ని గౌరవించడం రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యవహారశైలిపై కొంతకాలంగా పార్టీలోనూ, సోషల్ మీడియాలోనూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయనలో ఆత్మవిశ్వాసం కంటే అహంకారమే ఎక్కువగా కనిపిస్తోందన్న చర్చ సాగుతోంది.

**సొంత పార్టీ నుంచే విమర్శల సెగ**
కేటీఆర్ సోదరి కల్వకుంట్ల కవిత సైతం ఆయన వైఖరిపై పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల ఓటమి నేపథ్యంలో గతంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు, కార్యకర్తలతో ఆయన సంభాషణల్లో కనిపించిన అసహనం, సామాన్య ప్రజలతో వ్యవహరించిన తీరును నెటిజన్లు మరోసారి తెరపైకి తెస్తున్నారు. ఇవన్నీ బీఆర్ఎస్‌కు, ముఖ్యంగా కేటీఆర్ రాజకీయ ఇమేజ్‌కు నష్టం చేస్తున్నాయని విశ్లేషిస్తున్నారు.

**'అది అహంకారం కాదు.. ఆత్మవిశ్వాసం'**
అయితే కేటీఆర్ అనుచరులు మాత్రం ఈ విమర్శలను అంగీకరించడం లేదు. విద్యావంతుడైన కేటీఆర్‌కు ఇంగ్లిష్, హిందీ, తెలుగు భాషల్లో మంచి పట్టు ఉందని.. అంతర్జాతీయ స్థాయి అంశాలపై అవగాహన, గ్లోబల్ విజన్‌తో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఆయనలో ఉన్నాయని చెబుతున్నారు. ఆయన మాట్లాడే తీరు ఆత్మవిశ్వాసానికి ప్రతీకేనని సమర్థిస్తున్నారు. మిగతా 02లో



దసరా వేళ సర్కారు

# తీపికబురు

ఉద్యోగులు' పెన్షనర్లకు రెండు డీఏలు విడుదల

డీఏలతో పాటు విద్యుత్, మార్కెట్ అంశాలపై ఆమోదం

- ప్రభుత్వంపై రూ.2,500 కోట్ల అదనపు భారం
- ఉద్యోగులకు ఊరట.. రైతులకు అలర్ట్
- 235 మండలాల్లో కరవు పరిస్థితులు
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు




**ముద్ర, హైదరాబాద్:**
దసరా పండుగ సమీపిస్తున్న వేళ ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ ఆమోదం తెలిపింది. డీఏల వల్ల రాష్ట్రప్రభుత్వంపై రూ.2,500 కోట్ల అదనపు భారం పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ .. మంత్రి వర్గ నిర్ణయాలను మీడియా సమావేశంలో వివరించారు. విద్యుత్ వినియోగం పెరిగిందని, నిన్న ఒక్కరోజే 19,892 మెగా వాట్ల విద్యుత్ వినియోగం జరిగిందన్నారు. నిన్నటితో వర్షాకాలం ముగిసినట్టు వాతావరణశాఖ తెలిపిందని, సగటున 17శాతం మేర తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరవు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ అత్యవసర నివేదిక సిద్ధం చేస్తోందని తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీ నివేదిక సిద్ధం చేశాక.. త్వరలో కేబినెట్ సమావేశమవుతుందన్నారు. ఎల్‌నినో పరిస్థితులపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 5,800 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయించినట్టు తెలిపారు. తెలంగాణ డిజిటల్ మీడియా అడ్వర్టైజ్‌మెంట్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. తొలిదశలో కోహెడ ఫ్రూట్ మార్కెట్‌కు రూ.650 కోట్లు మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పొంగులేటి వివరించారు.



ఖైరతాబాద్ సమరంలో

# ట్విస్ట్

- ఉపఎన్నికకు బ్రేక్?
- హైకోర్టుకు ఈసీ క్లారిటీ
- విజయారెడ్డి పిటిషన్‌తో బిగ్ ట్విస్ట్
- ఇప్పట్లో ఉపఎన్నిక నోటిఫికేషన్ లేనట్లే!
- దానం నాగేందర్‌పై పాత కేసే కీలకం

## కోర్టు తీర్పుపైనే ఉపఎన్నిక భవిష్యత్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
హైదరాబాద్ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఖాళీ అయిన ఈ స్థానానికి త్వరలోనే ఉపఎన్నిక శంఖారావం మోగుతుందని ఆశావహులు సన్నద్ధమవుతున్న వేళ, కాంగ్రెస్ నాయకురాలు, దివంగత నేత పీజేఆర్ కుమార్తె పి. విజయారెడ్డి వేసిన లీగల్ పిటిషన్ ఎన్నికల ప్రక్రియను ఒక్కసారిగా బ్రేక్ వేసింది. ఈ వివాదం తేలేవరకు ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేయవద్దంటూ ఎన్నికల సంఘానికి స్పష్టత రావడంతో నియోజకవర్గ సమరం చట్టపరమైన చిక్కుల్లో పడింది.
అసలు ఈ న్యాయపోరాటానికి పునాది 2023 సాధారణ ఎన్నికలలోనే పడింది. నాటి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ విజయం సాధించగా మిగతా 02లో

బీసీ రిజర్వేషన్లను

## అడ్డుకున్న వైసీపీ

బీసీలకు 34% రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టుకు వెళ్తాం:
సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు 02

- ఎన్టీఆర్ నుంచి టీడీపీ బీసీలకు అండగా ఉంది
- బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా పైకి తీసుకెళ్లడమే లక్ష్యం
- గత ప్రభుత్వం 24 శాతానికి తగ్గించింది.. మేం 34 శాతానికి పెంచాం



## పౌరుడే కేంద్రంగా పాలన

యూపీఎస్సీ శతాబ్ది వేడుకల్లో
మోదీ కీలక సందేశం

- 'నేషన్ ఫస్ట్.. సిటిజన్ ఫస్ట్'పై ఫోకస్
- ప్రజాసేవే లక్ష్యంగా పని చేయాలి
- 'ప్రభుత్వమే మై-బాప్' భావనకు కాలం చెల్లింది
- ధైర్యవంతుడైన పైలట్ స్మిత్ మచ్చార్‌కు మోదీ ప్రశంసలు

02



## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

02

రేవంత్‌కు కేటీఆర్
బహిరంగ సవాల్

- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- తప్పు తేలితే శిక్షకు సిద్ధం
- ప్రభుత్వ హామీలపై పోరాటం చేస్తాం

ఇదీ AI
ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 02 అక్టోబర్, 2026
2 జనరల్ న్యూస్
General NEWS

నిమ్మరసం, తేనెను సమాన మోతాదులో కలిపి ట్యాన్ ఉన్న ప్రాంతాల్లో అప్లై చేయాలి. 15 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. అయితే సున్నితమైన చర్మం ఉన్నవారు నిమ్మరసంతో జాగ్రత్తగా ఉండాలి.



# స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్

**ముద్ర, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్థానిక పోరుకు సంబంధించిన పలు సవాలు పిటిషన్లపై గురువారం తీర్పు వెలువరించిన ధర్మాసనం.. రాబోయే ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీంతో గత కొంతకాలంగా కొనసాగుతున్న రాజకీయ, న్యాయపరమైన ఉత్కంఠకు తెరపడగా, రాష్ట్రంలో మున్సిపల్, పంచాయతీ ఎన్నికల సమరానికి దారి సుగమమైంది.

**బీసీ రిజర్వేషన్ల జీవోలు కొట్టివేత**

ఈ విచారణలో భాగంగా బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు కొట్టివేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదంటూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలకు ఈ జీవోలు వ్యతిరేకంగా ఉన్నాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. కాబట్టి, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా 50 శాతం పరిమితి లోపే రిజర్వేషన్లను పునర్విభజించి ఎన్నికలకు వెళ్లాలని స్పష్టం చేసింది.

**వైసీపీ పిటిషన్లు డిస్మిస్**

మరోవైపు ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఓటర్ల సమగ్ర రివిజన్ ప్రక్రియ ముగిసే వరకు, పూర్తిస్థాయి ఓటర్ల జాబితా వచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ఈ విన్నపాన్ని తోసిపుచ్చిన కోర్టు, ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి సరైన ప్రాతిపదిక లేదని స్పష్టం చేసింది.

**వార్డుల పునర్విభజన పిటిషన్లు డిస్మిస్**

వీటితో పాటు పంచాయతీల విలీనం, వార్డుల పునర్విభజనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లతో కలిపి మొత్తం ఐదు పిటిషన్లపై హైకోర్టు తుది తీర్పును వెలువరించింది. ఈ తీర్పుతో స్థానిక ఎన్నికలను వేగంగా పూర్తిచేసి, పాలనా యంత్రాంగాన్ని పల్లెలు, పట్టణాల్లో బలోపేతం చేసేందుకు మార్గం సుగమమైంది. కోర్టు నిర్దేశించిన ఆరు వారాల వ్యవధిలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం తుది సమాయత్తమవుతోంది.

**ఇక ఎన్నికల వేడి**

హైకోర్టు తీర్పుపై అధికార, ప్రతిపక్షాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు కోర్టు ఆదేశించడంపై కూటమి నేతలు హర్షం వ్యక్తం చేస్తుండగా, బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం మోసం చేసిందని వైసీపీ ఆరోపిస్తోంది. రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాలు స్థానిక సమరంతో మరింత వేడెక్కడం ఖాయం .



# 'పౌరుడే కేంద్రం'గా పాలన

**ముద్ర, న్యూఢిల్లీ:**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో శతాబ్ది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని కీలక ప్రసంగం చేశారు. సివిల్ సర్వీసుల నియామకాల్లో 'నేషన్ ఫస్ట్.. సిటిజన్ ఫస్ట్' అనే రెండు ప్రమాణాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వమే అన్నింటికీ ఆధారం అనే పాత భావన నుంచి బయటపడి.. పౌరుడి సేవకు ప్రాధాన్యత ఇచ్చే పాలనా విధానం వైపు భారత్ ముందుకు సాగాలని మోదీ అన్నారు. ప్రజా పదవుల ఆకర్షణ కంటే ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్న యువతను సివిల్ సర్వీసుల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అభ్యర్థుల పరిజ్ఞానాన్ని మాత్రమే కాకుండా.. ప్రజాసేవలోకి రావాలనే వారి ఉద్దేశాన్ని కూడా ఎంపిక ప్రక్రియలో పరిశీలించాలని సూచించారు.

UPSC 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. 1937లో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా, 1950లో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత UPSCగా రూపాంతరం చెందింది. ప్రస్తుతం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 315–323 పరిధిలో స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా పనిచేస్తోంది. సివిల్ సర్వీసెస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్, NDA, CDS, CAPF సహా పలు కీలక పరీక్షలను నిర్వహిస్తోంది.

మోదీ స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దేశ పరిపాలనా వ్యవస్థ నిర్మాణంలో పోషించిన పాత్రను గుర్తుచేసుకున్న ఆయన.. నేతాజీ సుభాష్ చంద్రబోస్ UPSC తరహా సివిల్ సర్వీసుల ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. మరోవైపు, ఇటీవల ఫ్లైట్



దుబాయ్ విమానంలో చోటుచేసుకున్న ఘటనలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌ను కూడా ప్రధాని మోదీ ప్రశంసించారు. గాయపడినప్పటికీ విమానాన్ని సురక్షితంగా అత్యవసర ల్యాండింగ్ చేయడంలో ఆయన చూపిన ధైర్యాన్ని అభినందించారు. UPSC భవిష్యత్ దిశగా ట్రస్ట్, ట్రాన్స్‌పరెన్సీ, టెక్నాలజీకి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ అజయ్ కుమార్ తెలిపారు.

# రీఛార్జ్‌తోనే రూ. లక్ష బీమా

**ముద్ర, ముంబై :**

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ తమ కస్టమర్లకు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పింది. రెండు ప్రత్యేక ప్రీపెయిడ్ ప్లాన్లపై ఉచిత ఇన్సూరెన్స్ ప్రయోజనాలను ప్రకటించింది. ఈ ఆఫర్ ద్వారా వినియోగదారులకు రూ. లక్ష వరకు యాక్సిడెంటల్ కవరేజి, అలాగే రూ. 10,000 వరకు సైబర్ ఫ్రాడ్ రక్షణ లభిస్తాయి. STV 202, STV 2449 ప్రీపెయిడ్ ప్లాన్లపై ఈ ఫ్రీ బీమా, సైబర్ ఫ్రాడ్ కవరేజీని కల్పించనుంది. అంటే వినియోగదారులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.లక్ష వరకూ బీమా, BSNL నంబర్ పై సైబర్ మోసాలకు గురైతే రూ.10 వేలు కవరేజీ లభిస్తుంది. నేటి నుంచే ఇవి అమల్లోకి వస్తున్నట్లు సంస్థ ప్రకటించింది.

ఈ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని అందించేందుకు బీఎస్ఎన్ఎల్ సంస్థ ది ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ (OICL)తో BSNL ఒప్పందం కుదుర్చుకుంది. STV 202 ప్లాన్ లో 300 నిమిషాల వాయిస్ కాల్స్, 5GB డేటా, 100 SMSలు లభిస్తాయి. STV 2449 ప్లాన్‌లో 365 రోజుల వ్యాలిడిటీతో అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2GB డేటా, 100 SMSలు లభిస్తాయి. ఈ రెండు ప్లాన్లపై రూ. లక్ష యాక్సిడెంటల్ డెత్ ఇన్సూరెన్స్, రూ.10,000 సైబర్ ఫ్రాడ్ రక్షణ ఆటోమేటిక్‌గా లభిస్తాయి. వినియోగదారులు దీని కోసం ప్రత్యేకంగా ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు.

అక్టోబర్ 1న బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఇన్సూరెన్స్ ప్లాన్లను ప్రారంభించారు. చందాదారులు ఈ ప్లాన్లతో రీఛార్జ్ చేసుకున్న 24 గంటల తర్వాత ఇన్సూరెన్స్ పాలసీ ఆటోమేటిక్‌గా యాక్టివేట్ అవుతుంది. పాలసీకి సంబంధించిన వివరాలు ఎస్ఎంఎస్ లో వస్తాయి.

# కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఎయిర్ లిఫ్ట్



**ముద్ర, న్యూఢిల్లీ :**

నిన్న ఫ్లై దుబాయ్ ఘటలో తనపై తోటి పైలట్ దాడి చేసిన ఘటనలో ప్రాణాలకు తెగించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని అధికారులు చెబుతున్నప్పటికీ గురువారం ఆయనను మెరుగైన చికిత్స నిమిత్తం ఎయిర్ లిఫ్ట్ చేశారు. సౌది నుంచి దుబాయ్ కి విమానంలో తరలిస్తున్నారు. ఇప్పటి వరకు అతడికి వాయువ్య సౌదీ అరేబియాలోని తబుక్ నగరంలో ఉన్న ఒక ఆసుపత్రిలో అవసరమైన వైద్య సహాయం అందుతోందని రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియా పోస్ట్‌లో ఇవాళ పేర్కొంది. ఆయన ఆరోగ్య పరిస్థితిపై పూర్తి అప్‌డేట్ రావాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆయన "నిలకడగా ఉన్నట్లు సమాచారం" అని తెలిపింది. జిద్దాలోని భారత కాన్సులేట్ జనరల్, ఎంబసీ అధికారులు మచ్చార్ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నారని స్పష్టం చేసింది. ఆయన త్వరలోనే గాయాల నుండి కోలుకోవాలని ఆశిస్తున్నాం. మేము ఆయన కుటుంబంతో నిరంతరం టచ్‌లో ఉన్నాం. సౌదీ అధికారులతో మాట్లాడుతూ ఆయన ఆరోగ్యానికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకుంటామని, ఆయన సంక్షేమం కోసం సాధ్యమైనంత అన్ని విధాలా సహాయం అందిస్తామని వారికి అభయం ఇచ్చామని ఎంబసీ పేర్కొంది.

**కత్తితో కాదు గొడ్డలితో దాడి?**

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ కు 174 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానాన్ని కూల్చివేయాలని కోపైలట్ ప్రయత్నించగా పైలట్ మచ్చర్ దాన్ని అడ్డుకున్నారు. మొదట కో–పైలట్ కత్తితో దాడి చేశాడని భావించినప్పటికీ కత్తికి బదులు గొడ్డలితో దాడికి పాల్పడినట్లు పలు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. విమానంలో అత్యవసర సమయాల్లో వాడే 'క్రాష్ యాక్స్' (గొడ్డలి)తోనే ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. దాడి జరిగిన తీరుపై కథనాలు, మరో వైపు మచ్చర్ ను సౌదీ నుంచి ఎయిర్ లిఫ్ట్ చేయడంతో మచ్చర్ ఆరోగ్య పరిస్థితిపై భారతీయుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

**కాక్‌పిట్‌లో గొడ్డలి ఎందుకు ఉంటుంది?**

విమానం గాల్లో ఉండగా ఆయుధం కాక్‌పిట్‌లోకి ఎలా వచ్చిందనే సందేహం అందరిలోనూ నెలకొంది. అయితే నిందితుడు బయటి నుండి ఎలాంటి ఆయుధాన్ని స్మగ్లింగ్ చేయలేదని విచారణలో తేలింది. అంతర్జాతీయ ఏవియేషన్ రూల్స్ ప్రకారం ప్రతి కమర్షియల్ విమాన కాక్‌పిట్‌లో తప్పనిసరిగా అత్యవసర పరిస్థితుల్లో (ఎమర్జెన్సీ క్రాష్/అగ్నిప్రమాదాలు) వాడేందుకు 'క్రాష్ యాక్స్' (ఫైర్ గొడ్డలి)ను ఏర్పాటు చేస్తారు. 25 ఏళ్ల క్రితం వరకు ఇవి ప్రధాన క్యాబిన్‌లో ఉండేవి. అయితే సెప్టెంబర్ 11 (9/11) ఉగ్రదాడి ఘటన తర్వాత భద్రతా కారణాల దృష్ట్యా ఈ అత్యవసర గొడ్డలిని నేరుగా కాక్‌పిట్‌లో, పైలట్లకు అందుబాటులో ఉండేలా అమర్చడం ప్రారంభించారు. నిందితుడు ఈ అత్యవసర సాధనాన్నే ఆయుధంగా మార్చుకుని దాడికి తెగబడినట్లు తెలుస్తోంది.

# ఖైరతాబాద్ సమరంలో బిగ్ ట్విస్ట్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన విజయారెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే ఎన్నికల అఫిడవిట్ ఫారం–26 లో దానం నాగేందర్ తన కుటుంబ ఆస్తుల వివరాలను సమగ్రంగా వెల్లడించకుండా దాచిపెట్టారంటూ విజయారెడ్డి 2024లోనే తెలంగాణ హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఆయన పదవి ఊడటంతో కొత్తగా ఉపఎన్నిక నిర్వహించే కంటే, పాత పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుని తననే విజేతగా ప్రకటించే అవకాశాలు సైతం చట్టపరంగా ఉన్నందున.. పిటిషన్ తేలేవరకు ఉపఎన్నిక ప్రక్రియను నిలిపివేయాలని ఆమె తాజాగా కోర్టు తలుపులు తట్టారు.

పార్టీ మారిన దానం నాగేందర్‌ను కాంగ్రెస్ తరఫున ఉపఎన్నిక బరిలో నిలపాలని అధిష్ఠానం భావిస్తున్న వేళ, అదే పార్టీకి చెందిన విజయారెడ్డి లీగల్ అస్త్రం విసరడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. దీనితో రాబోయే రోజుల్లో న్యాయస్థానం ఎలాంటి తీర్పు ఇస్తుందనేది అత్యంత కీలకంగా మారింది. ఒకవేళ హైకోర్టు విజయారెడ్డి దాఖలు చేసిన పాత ఎన్నికల పిటిషన్‌ను వేగవంతంగా విచారించి దానం ఎన్నిక చెల్లదని తేలిస్తే, అక్కడ ఉపఎన్నిక అవసరం లేకుండానే రెండో స్థానంలో ఉన్న విజయారెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం దక్కే లీగల్ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదే జరిగితే ఖైరతాబాద్‌లో పీజేఆర్ వారసత్వ రాజకీయం మరోసారి బలపడే అవకాశం ఉంది.

ఈ లీగల్ ట్విస్ట్‌తో ఖైరతాబాద్ ఉపఎన్నిక రేసులోని ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కొత్తగా బరిలోకి దిగుతామన్న కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన తమ ప్రచార వేగానికి తాత్కాలికంగా బ్రేకులు వేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. సాధారణ నిబంధనల ప్రకారం ఆరు నెలల గడువు ఉన్నప్పటికీ, కోర్టు పరిధిలోని ఈ ఎలక్షన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు వెలువరించే తుది ఆదేశాలపైనే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి భవిష్యత్ ఎన్నికల ముహూర్తం పూర్తిగా ఆధారపడి ఉంది.

# బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న వైసీపీ

**ముద్ర, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో పేదల సంక్షేమం, అభివృద్ధి, బీసీ రిజర్వేషన్లు, పోలవరం సహా పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. రేపల్లెలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ కాలం నుంచి టీడీపీ బీసీలకు అండగా ఉందని అన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను తామే అమలు చేశామని చెప్పారు. గత ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మళ్లీ 34 శాతానికి పెంచామని తెలిపారు. అయితే 34 శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ ప్రతిపక్షం కోర్టుకు వెళ్లి అడ్డుకుందని అన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు ప్రకటించారు.

బీసీ వర్గాలను ఆర్థికంగా, రాజకీయంగా పైకి తీసుకురావడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు చెప్పారు. ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వారు డీఎస్సీపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. డీఎస్సీని అడ్డుకునేందుకు 300 కేసులు వేశారని ఆరోపించారు. ఇప్పుడు బీసీ రిజర్వేషన్లను కూడా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పేదల సమస్యలను పరిష్కరిస్తూ సుపరిపాలనతో పునర్నిర్మాణం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. గత పాలకులు ఇష్టానుసారంగా అప్పులు చేశారని, ప్రస్తుతం ఒక్కో సమస్యను సరిచేస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. పరిస్థితులను పూర్తిగా చక్కదిద్దేందుకు మరికొంత సమయం పడుతుందని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.

# మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?



**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్య వహారంమరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవా ల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తుల తో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధ మని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చే సిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపా రం చేయడం తప్పా? అని ప్రశ్నించా రు. తాను 2006లో హోటల్ వ్యాపా రం ప్రారంభించానని చెప్పారు. ప్ర స్తుతం మూడు హోట ళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించాన ని పేర్కొన్నారు.

సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీ ఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీ సం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అ యితే సీఎం తన పర్యటనలో రాజకీ య విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నా రు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్ర భుత్వం ఇలాంటి రాజకీయాలు చే స్తోందని విమర్శించారు. ఇక హామీ లు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్ప ష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరా టం కొనసాగిస్తామని చెప్పారు.

# టార్గెట్ కేటీఆర్..

(మొదటి పేజీ తరువాయి)

ఐటీ, కార్పొరేట్ వర్గాల్లో కేటీఆర్‌కు ఉన్న ఆదరణకు ఇదే కారణమని పేర్కొంటున్నారు.

**గ్రామీణ తెలంగాణలో మాత్రం భిన్నమైన అభిప్రాయం?**

మరోవైపు గ్రామీణ ప్రాంతాలు, బహుజన వర్గాల్లో కేటీఆర్ వ్యవహారశైలిపై భిన్నమైన అభిప్రాయం ఉందన్న వాదన వినిపిస్తోంది. ఆయన తీరును 'దొరతనం'గా భావించే వర్గాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎదుర్కొన్న పరాజయానికి ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు నాయకత్వంపై ఏర్పడిన ఇలాంటి ప్రతికూల ఇమేజ్ కూడా ఒక కారణమనే విశ్లేషణలు ఉన్నాయి.

**ఇకనైనా మార్పు రావాల్సిందేనా?**

ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కేటీఆర్ మరింత ప్రజలకు చేరువగా ఉంటారని, కార్యకర్తలతో మమేకమవుతారని బీఆర్ఎస్ శ్రేణులు ఆశించినా.. ఆ స్థాయిలో మార్పు కనిపించడం లేదన్న అసంతృప్తి క్షేత్రస్థాయిలో ఉందని ప్రచారం జరుగుతోంది. చిన్న ప్రశ్నలు, సూచనలపైనా అసహనం వ్యక్తం అమవుతోందన్న విమర్శలు ప్రతికూలంగా మారుతున్నాయి.

**ఇమేజ్ మేకోవర్.. కేటీఆర్‌కు తప్పనిసరి?**

రాజకీయంగా మళ్లీ బలపడాలంటే కేటీఆర్ తనపై ఏర్పడిన 'అహంకారి' అనే ముద్రను తొలగించుకోవాల్సిన అవసరం ఉందన్న అభి ప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజల సమస్యలను ఓపికగా వినడం, క్షేత్రస్థాయి కార్యకర్తలకు అందుబాటులో ఉండడం, సామాన్యులతో మరింత వినమ్రంగా మెలగడం ద్వారా ఈ ఇమేజ్‌ను మార్చుకోవచ్చని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు. ఆత్మవిశ్వాసం రాజకీయ బలమైతే.. వినమ్రత ప్రజల్లో బలమైన పునాదిని ఇస్తుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే కేటీఆర్ ముందున్న అసలు సవాల్.

# 92 లక్షల మందికి నోటీసులు..

**ముద్ర, హైదరాబాద్:**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మందికి నోటీసులు ఇస్తే ఇప్పటి వరకు 65 లక్షల మంది ఓటర్లు నోటీసులకు సమాధానం ఇచ్చినట్లు సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. 54 లక్షల మందిని తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చామన్నారు. నవంబర్ 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ ఉంటుందని ఆలోపు మిగతా ఓటర్లను కూడా తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు హియరింగ్ అనే ప్రక్రియ ఉండేదని ఇకపై దాని స్థానంలో డాక్యుమెంట్ కలెక్ట్ చేసుకోవడమే ఉంటుందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామని, నోటీసులు అందుకున్న వారిలో 40 శాతం మందిని తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చామన్నారు.



**ఇంటివద్దకే బీఎల్‌వోలు**

నోటీసులు అందినవారి ఇళ్ల దగ్గరకే బీఎల్‌వోలు వెళ్లి సంబంధిత పత్రాలు తీసుకుంటారన్నారు. ఒక చోట కూర్చుని ఓటర్లను పిలిపించుకోవడం కుదరదని ఓటర్ల ఇళ్ల వద్దకే వెళ్లి వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు బీఎల్‌వోలకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చ్మన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ ఉండాల్సిన పని లేదని ఒక్కరే మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందన్నారు. ఫారమ్–6 కు డిక్లరేషన్ అనేది ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారని, తెలంగాణలో ఎస్ఐఆర్ ఇంకా కొనసాగుతున్నందునా ఫారమ్–6 కు డిక్లరేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. నోటీసులు అందిన వారిలో ఎవరైనా వలస వెళ్లి ఉంటే అలాంటి వారిని పిలవాల్సిన అవసరం లేదని ఈఆర్వో ఆన్‌లైన్‌లోనే వారిని సంప్రదించి ప్రక్రియను పూర్తి చేస్తారన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలనేది ఈసీ ఉద్దేశం అన్నారు.

మరోసారి గడువు పెంపు లేదు సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదన్నారు. ఇప్పటికే ఓసారి గడువు పెంపుకోరామని అందువల్ల ఇది కుదరదన్నారు. ప్రస్తుతం ఉన్న గడువు ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు గడువు అక్టోబర్ 7 వరకు ఉండగా నోటీసులు జారీ / అభ్యంతరాల పరిష్కారానికి నవంబర్ 5 వరకు, తుది ఓటరు జాబితా 9 నవంబర్‌న ప్రచురించనున్నారు.

## కీరదోసకాయతో చల్లదనం

కీరదోసకాయ రసాన్ని కాటన్‌తో ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. కీరదోస ముక్కలను నేరుగా ముఖంపై ఉంచినా చర్మానికి చల్లదనం లభిస్తుంది.



## సింగరేణి బొగ్గు రవాణాలో 4 శాతం వృద్ధి

**ముద్ర, సింగరేణి భవన్** : తొలి ఆర్థిక అర్ధ సంవత్సరంలో సింగరేణి బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో వృద్ధి సాధించింది. గత ఏడాది ఇదే కాలంలో 287.6 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయగా, ఈసారి 299.4 లక్షల టన్నులతో 4 శాతం వృద్ధి నమోదు చేసింది. ఓవర్ బర్డెన్ తొలగింపులోనూ 11 శాతం వృద్ధి సాధించింది. తెలంగాణ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు గత ఏడాది 159.1 లక్షల టన్నులతో పోలిస్తే ఈసారి 198.2 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేసింది. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ప్రాధాన్యమిస్తూ ఉత్పత్తి, రవాణాను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ఏడాదికి 620 లక్షల టన్నుల ఉత్పత్తి, 650 లక్షల టన్నుల రవాణా లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు.

## అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు తెస్తాం

**- సీఎం చంద్రబాబు**





**ముద్ర, అమరావతి** : అరకు కాఫీతోనే తనకు రోజు మొదలవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గొప్ప వారసత్వానికి అరకు కాఫీ ప్రతీకగా నిలుస్తోందన్నారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా అరకు కాఫీ ప్రయాణాన్ని పరిచయం చేశారు. రాష్ట్రంలోని కొండ ప్రాంతాల నుంచి ప్రపంచవ్యాప్తంగా కాఫీ కప్పుల్లోకి చేరుతోందని తెలిపారు. అరకు ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి కాఫీ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పెట్టుబడులు పెడుతోందన్నారు. స్థానిక కాఫీ రైతులకు మరింత సాధికారత కల్పించడంతో పాటు.. ప్రపంచ కాఫీ పటంలో ఆంధ్రప్రదేశ్‌కు సముచిత స్థానం కల్పించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## గచ్చిబౌలిలో వ్యభిచార ముఠా గుట్టురట్టు

**ముద్ర, హైదరాబాద్**: నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టురట్టయింది. ఓ హోటల్ కేంద్రంగా విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో హోటల్‌పై దాడి చేసి నిర్వాహకులు నిఖిల్, రామ్మోహన్‌రెడ్డి, విటుడు హర్షిత్ సింఘానియాతో పాటు ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.13వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిర్వాహకుడు నిఖిల్‌ను ఢిల్లీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఉజ్బెకిస్థాన్ నుంచి వచ్చిన మహిళల పాస్‌పోర్టులు, వీసాలు చెల్లుబాటులో ఉన్నట్లు నిర్ధరించారు. కొద్దిరోజుల క్రితమే వారు హైదరాబాద్‌కు వచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సిద్ధమైన ఎర్రవల్లి భూసర్వే నివేదిక.. ఉత్కంఠ!

**ముద్ర, హైదరాబాద్**: సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి భూసర్వే నివేదిక దాదాపు సిద్ధమైంది. సర్వే నిర్వహించిన రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ హైమావతికి నివేదిక అందింది. దాన్ని నేడు కలెక్టర్ ప్రభుత్వానికి అందజేయనున్నారు. నివేదికలో పేర్కొన్న అంశాలపై ఉత్కంఠ నెలకొంది.ఎర్రవల్లిలో భూములు అన్యాక్రాంతం అయ్యాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో అధికారులు సర్వే ప్రక్రియ ప్రారంభించారు. మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ప్రభుత్వ భూములున్న సర్వే నంబరు 325లో హద్దులు నిర్ధరించారు. రైతులకు నోటీసులు ఇచ్చి సర్వే నిర్వహించారు. తమకు చెందిన భూములు సైతం 2014లో 325 సర్వే నంబరులో కలిపేశారని.. న్యాయం చేయాలని శివారు వెంకటాపూర్ గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కలెక్టర్‌తో పాటు మంత్రి పొంగులేటిని కలిసి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సర్వే నివేదికలో ఆ గ్రామస్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదని సమాచారం.

## పంచాయతీల్లో చెక్ పవర్‌పై కీలక నిర్ణయం...

**- 7 రోజులు దాటితే యాక్షన్**




**ముద్ర, హైదరాబాద్** : గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనుల నిధుల విడుదల, వివిధ బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యానికి చెక్ పెడుతూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెక్కుల చెల్లింపులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రక్రియ వేగవంతంగా సాగేలా చూడాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించడంతో జిల్లా పంచాయతీ అధికారులకు (DPO) స్పష్టమైన ఉత్తర్వులు జారీ అయ్యాయి. గ్రామాల్లో సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య ఉన్న విభేదాల కారణంగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోయి అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ మార్గదర్శకాలను విడుదల చేసింది.

**7 రోజులకు మించి ఆలస్యం చేస్తే కలెక్టర్ విచారణ**

చెక్కులపై సంతకాలు చేయడంలో ఉప సర్పంచ్‌లు అనవసరంగా జాప్యం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తగిన కారణం లేకుండా 7 రోజులకు మించి చెక్కులపై సంతకం చేయకుండా ఉప సర్పంచ్‌లు కాలయాపన చేస్తే, సంబంధిత జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ చేపట్టాల్సి ఉంటుంది. ఆ విచారణలో ఉప సర్పంచ్ ఉద్దేశపూర్వకంగానే చెక్కులను నిలిపివేసినట్లు తేలితే వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటారు.

**అధికారులకు జాయింట్ 'చెక్ పవర్' బదిలీ**

కారణం లేకుండా ఏడు రోజులకు మించి చెక్కులను పెండింగ్‌లో పెడితే, గ్రామ పంచాయతీల్లో నిధుల చెల్లింపులు ఆగిపోకుండా ఉండేందుకు కలెక్టర్లకు ప్రత్యేక అధికారాలు కల్పించారు. అటువంటి పరిస్థితుల్లో ఉప సర్పంచ్‌ల జాయింట్ చెక్ పవర్‌ను రద్దు చేసి, వారి స్థానంలో పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ (MPO) లేదా ఎంపీడీవో (MPDO) లలో ఒకరికి జాయింట్ 'చెక్ పవర్' కేటాయించేలా జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులు వేగవంతం కావడమే కాకుండా, చెక్కుల సంతకాల చుట్టూ తిరిగే పంచాయితీలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

# ఖైరతాబాద్‌లో పొరపాటున ఓడిపోయాం.. ఈసారి గెలుపు ఖాయం

**- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌తో భాజపాకు పొత్తు ఉండదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ''యాదాద్రి థర్మల్ ప్లాంట్ కోల్ లింకేజీకి సంబంధించి సానుకూల నిర్ణయం తీసుకుంటాం. సింగరేణిలో ఉన్న బొగ్గును వినియోగించుకునేలా యాదాద్రి థర్మల్ ప్లాంట్ ఎందుకు నిర్మించలేదో సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలి. ఖైరతాబాద్‌లో గతంలో పొరపాటున ఓడిపోయాం. ఇప్పుడు భాజపా గెలుపు ఖాయం. భాజపా ఓటు చోరీ చేయదు.. ప్రజల హృదయాలు మాత్రమే చోరీ చేస్తుంది. దేశ రాజకీయాల్లో మార్పు వస్తుందని రాహుల్‌గాంధీ చెబుతున్నారు. ప్రతిపక్ష నేత పదవి వేరొకరికి ఇస్తారేమో. దేశంలో మార్పు ప్రజల చేతుల్లో ఉంటుంది.. రాహుల్ గాంధీ చేతిలో కాదు. రాజ్యాంగ బద్ధ సంస్థలతో పాటు భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్‌ను ఆయన విమర్శిస్తున్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు

'సర్' విషయంలో హైదరాబాద్‌లో ఏం తప్పు జరిగిందో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నుంచి 8 మంది ఎంపీలు ఎలా గెలిచారు? శివుడు, రాముడి గురించి సీఎం బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రజలను అన్ని రకాలుగా విభజించే అలవాటు కాంగ్రెస్ పార్టీకే ఉంది. ప్రజలను ప్రాంతాల వారీగా విభజించి వైషమ్యాలు సృష్టించిన చరిత్ర ఆ పార్టీది. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం మాట్లాడారు. తొలగించిన ఓట్లను చేర్చాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. చనిపోయిన వారి ఓట్లనూ చేర్చాలా?బంగ్లాదేశ్ ఓటర్లను తిరిగి చేర్చాలా? బెంగాల్ నుంచి లక్షల మంది బంగ్లాదేశ్‌కు వెళ్లిపోయారు. బెంగాల్, బిహార్‌లో ఓట్ల శాతం పెరగడానికి 'సర్' కారణం. దేశంలో బంగ్లాదేశ్ ఓటర్లను చేర్చి విధ్వంసం సృష్టించాలని కాంగ్రెస్ చూస్తోందా?తెలంగాణలో ప్రభుత్వం పోకుండా ఆ పార్టీ చూసుకోవాలి. ఓటమి కడుపు మంటతో కాంగ్రెస్, విపక్షాలు భాజపాతో పాటు ఎన్నికల సంఘాన్ని విమర్శిస్తున్నాయి''అని కిషన్‌రెడ్డి అన్నారు.

## తెలంగాణకు ఐఎండీ బిగ్ అలర్ట్

**అక్టోబర్‌లోనూ వర్షాలు లేనట్టే..!**

**ముద్ర, హైదరాబాద్ :** భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అక్టోబర్ నెల వాతావరణ అంచనాలను (అవుట్‌లుక్) విడుదల చేసింది. ఈ అంచనాల ప్రకారం ఈ ఏడాది అక్టోబర్‌లోనూ వర్ష సూచనలు పెద్దగా లేవు. దీనివల్ల సాధారణంగా చల్లబడాల్సిన అక్టోబర్ నెల ఈసారి ఎండకాలాన్ని తలపించే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. సముద్రాల్లో తలెత్తుతున్న మార్పుల వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంపై బలమైన ఎల్ నినో (El Niño) పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఎల్ నినో పరిస్థితులు ఈ సంవత్సరాంతం వరకు మరింత బలపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మరోవైపు, హిందూ మహాసముద్రంపై ప్రస్తుతం తటస్థ ఐఓడీ పరిస్థితులు ఉన్నాయని, రాబోయే ఈశాన్య రుతుపవనాల కాలంలో కూడా ఇవే పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించారు.ఈ సముద్ర వాతావరణ పరిస్థితుల ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్ నెలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. అంతేకాకుండా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగే శీతాకాలం ప్రారంభ సీజన్‌లో కూడా మొత్తం వర్షపాతం సాధారణం కంటే తక్కువగానే ఉండవచ్చని తెలిపింది.

## రైతులకు కరెంట్ ఇవ్వకుండా రాజస్థాన్‌కు విద్యుత్ అమ్ముతారా?



**ముద్ర, హైదరాబాద్ :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమాకుల, అక్కనేపల్లి, అంక్షాపూర్ గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అనంతరం నర్మెట సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 7–8 గంటల కరెంట్ కూడా ఇవ్వలేకపోతోందని ఆరోపించారు.

లో–వోల్టేజ్ కారణంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, వాటిని సకాలంలో మార్చకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క నంగునూరు మండలంలోనే ఈ వారంలో 41 ట్రాన్స్‌ఫార్మర్లు, 100 నుంచి 200 మోటార్లు కాలిపోయాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో రైతులకు విద్యుత్ కొరత ఉన్నప్పటికీ సింగరేణి ద్వారా ఉత్పత్తి అయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు విక్రయించేందుకు ప్రభుత్వం జాయింట్ వెంచర్ ఎందుకు చేసుకుందని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులకు ముందుగా నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.

కనీసం 20 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతోపాటు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చేందుకు రోలింగ్ స్టాక్ ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వెంటనే మంజూరు చేసి, విద్యుత్ పరికరాల స్టాక్‌ను అన్ని జిల్లాల్లో అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం..

**మల్లేశ్ నుంచి కీలక సమాచారం రాబట్టిన పోలీసులు**



**ముద్ర, హైదరాబాద్**: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసు లో నిందితుడు మల్లేశ్ కస్టడీ ముగిసింది. సెప్టెంబరు 22 నుంచి 10 రోజుల పాటు మల్లేశ్‌ను విచారించిన బొల్లారం పోలీసులు.. వైద్య పరీక్షల అనంతరం గురువారం సాయంత్రం సికింద్రాబాద్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కస్టడీ విచారణలో భాగంగా నిందితుడి నుంచి పోలీసులు కీలక సమాచారం రాబట్టినట్టు తెలుస్తోంది. మల్లేశ్‌ను పోలీసులు మరోసారి కస్టడీకి కోరే అవకాశముందని సమాచారం.

# నేటి నుంచే క్యూర్ యాక్ట్.. హైదరాబాద్ పాలనలో బిగ్ ఛేంజ్

**మూడు కార్పొరేషన్లకు ఒకే పాలనా విధానం**
**1955 GHMC యాక్ట్ స్థానంలో కొత్త చట్టం**
**ప్రాపర్టీ ట్యాక్స్‌లో క్యాపిటల్ వాల్యూ విధానం**
**హైడ్రా కు చట్టబద్ధ అధికారాలు**

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ నగర మహానగర పాలనలో చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ నూతనంగా తీసుకువచ్చిన 'క్యూర్' (CURE) చట్టం నేటి నుంచి అధికారికంగా అమల్లోకి రానుంది. 1955 నాటి జీహెచ్‌ఎంసీ యాక్ట్ స్థానంలో రూపుదిద్దుకున్న ఈ కొత్త చట్టం ద్వారా జీహెచ్‌ఎంసీ (GHMC), సీఎమ్‌సీ (CMC), ఎమ్‌ఎమ్‌సీ (MMC) పరిధులకు ఒకే సమగ్ర పాలనా విధానం రానుంది. విలీన ప్రాంతాల్లో ఇప్పటివరకు ఉన్న వేర్వేరు పన్నుల విధానాలు, పాలనా వ్యత్యాసాలకు ఈ యాక్ట్‌తో శాశ్వతంగా తెరపడనుంది. మూడు కార్పొరేషన్ల పరిధిలో భవన నిర్మాణ అనుమతులు, ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల జారీకి సంబంధించి ఒకే రకమైన ఏకీకృత నిబంధనలు అమల్లోకి రానున్నాయి.




క్యాపిటల్ వాల్యూ ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్.. 'ఇంటిగ్రేటెడ్' బిల్లింగ్

క్యూర్ యాక్ట్ రాకతో నగరంలో ఆస్తిపన్ను విధింపు విధానంలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న 'రెంటల్ వాల్యూ' పద్ధతి స్థానంలో ఇకపై ఆస్తి విలువ (క్యాపిటల్ వాల్యూ) ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్ లెక్కించనున్నారు. దీనివల్ల నగరంలో ఆస్తిపన్ను పెరిగే అవకాశం ఉండగా, ఈ పెరిగిన పన్నుల విధానం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు కానుంది. డిజిటల్ గవర్నెన్స్‌ను ప్రోత్సహించే క్రమంలో ప్రతి ఆస్తికి ఒక ప్రత్యేక 'ఇంటిగ్రేటెడ్ ఐడెంటిటీ కోడ్' కేటాయించనున్నారు. దీని ద్వారా ఆస్తిపన్ను, డ్రింకింగ్ వాటర్ బిల్లు, సీవరేజ్, శానిటేషన్ చార్జీలన్నింటినీ కలిపి సింగిల్ పోర్టల్ ద్వారా ఇంటిగ్రేటెడ్ బిల్లింగ్ రూపంలో పౌరులకు అందించనున్నారు. అంతేకాకుండా నగరంలో ట్రాఫిక్, విపత్తుల నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు ప్రత్యేక అథారిటీలను ఏర్పాటు చేయనున్నారు.

**'హైడ్రా'కు చట్టబద్ధ హోదా.. ఆక్రమణలపై ఉక్కుపాదం**

నగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న 'హైడ్రా'కు క్యూర్ చట్టం ద్వారా పూర్తిస్థాయి చట్టబద్ధ హోదా లభించనుంది. చెరువులు, కుంటలు, నాలాలు , బహిరంగ ప్రభుత్వ భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడటంతో పాటు అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు హైడ్రా కు ఈ చట్టం ద్వారా అదనపు అధికారాలు కల్పించారు. నగరంలోని పబ్లిక్ అసెట్స్ రక్షణే ప్రధాన ధ్యేయంగా హైడ్రా ఇకపై మరింత స్పష్టమైన, పటిష్టమైన చట్టపరమైన అధికారాలతో పనిచేయనుంది.

## జపాన్‌లో ఆసియా క్రీడలను వీక్షించిన తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం

**మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌లో పర్యటిస్తున్న ప్రభుత్వ ప్రతినిధి బృందం**

**ముద్ర, హైదరాబాద్ / జపాన్:** జపాన్‌లోని ఐచి–నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం వీక్షించింది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌కు వెళ్లిన ఈ బృందంలో ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేన రెడ్డి, వీసీ & ఎండీ సోనీ బాలాదేవి ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రతినిధి బృందం ఆసియా క్రీడలను వీక్షించి, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పరిశీలించింది. ప్రపంచ స్థాయి క్రీడా వసతులు, పోటీల నిర్వహణ విధానాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఈ పర్యటన ద్వారా లభించింది. తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అవసరమైన అంశాలను అధ్యయనం చేయడంలో ఈ పర్యటన దోహదపడనుంది.



## గురువుకు పూర్వ విద్యార్థుల కారు గిఫ్ట్

**ముద్ర, కరీంనగర్ :** విద్యాబుద్ధులు నేర్పిన గురువుపై పూర్వ విద్యార్థులు వినూత్నంగా గురు భక్తిని చాటుకున్నారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ లో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పని చేస్తున్న గుర్రం మహేశ్వర్ రెడ్డి ఇవాళ పదవీ విరమణ పొందారు. 2014 నుంచి 2024 వరకు ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులంతా కలిసి ఆయనకు ఎలక్ట్రిక్ కారును బహుమతిగా ఇచ్చారు. వారిలో యూట్యూబర్ అనిల్ కూడా ఉన్నారు. మాస్టారును వేదిక పైనుంచి ఎత్తుకొని కారులో కూర్చోబెట్టారు. తన విద్యార్థులు చూపిన అభిమానానికి ఆ మాస్టారు భావోద్వేగానికి గురయ్యారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in | @mudranews

శుక్రవారం, 01 అక్టోబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

## బీపీకి పొటాషియం ఎందుకు?




శరీరంలో సోడియం స్థాయిని సమతుల్యం చేయడంలో పొటాషియం సహాయపడుతుంది. అదనపు సోడియంను మూత్రం ద్వారా బయటకు పంపడంలో, రక్తనాళాలు సక్రమంగా పనిచేయడంలో ఇది ఉపయోగపడుతుంది. అందుకే బీపీ నియంత్రణకు అనుకూలమైన ఆహారంలో పొటాషియం ఉండే పండ్లకు ప్రాధాన్యం ఉంటుంది.

**అరటిపండులో ఎక్కువ**

ఒక మధ్యస్థ పరిమాణం ఉన్న అరటిపండులో సుమారు 400 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. అయితే పండు పరిమాణాన్ని బట్టి ఈ మొత్తం మారవచ్చు. బీపీని నియంత్రించుకోవడానికి అవసరమైన పొటాషియంను ఆహారం ద్వారా పొందడంలో అరటి పండు ఉపయోగపడుతుంది. అయితే కేవలం అరటిపండ్లు తినడం వల్లే బీపీ తగ్గుతుందని చెప్పలేం.

**నారింజలోనూ పోషకాలు**

అరటిపండుతో పోలిస్తే నారింజలో పొటాషియం కొంత తక్కువగా ఉండవచ్చు. అయితే ఇందులో విటమిన్ సి, ఫోలేట్, ఫ్లేవనాయిడ్లు వంటి అనేక పోషకాలు ఉంటాయి. విటమిన్ సి శరీరంలోని యాంటీఆక్సిడెంట్ వ్యవస్థకు సహాయపడుతుంది. నారింజను జ్యూస్‌గా కాకుండా పండుగా తింటే ఫైబర్ కూడా లభిస్తుంది.

## విస్మృతికి గురైన తెలంగాణ పులి
# నల్ల నర్సింహులు

జీవితం సమాజానికి అంకితం చేసి పేరు కోసం పాకులాడక జనం పేగు బాధ తీర్చడానికి బ్రతికిన వీరులెందరో చరిత్రలో విస్మృతికి గురయ్యారు. వారి త్యాగాలు భూమిలో కప్పి వేయబడినప్పటికీ అవి విత్తనంలా మొలకెత్తక మానదు, అది బాహ్య ప్రపంచాన్ని చూడక మానదు, మానై సమాజానికి ఆదర్శంగా నిలబడకమానదు. అలా ఆల స్యంగా వెలుగులోకి వచ్చిన నిలువెత్తు ఉద్యమ స్ఫూర్తి శిఖరం తెలంగాణ పులి నల్ల నర్సింహులు.



మూలక సురేష్
9441327666

తెలంగాణలో ఏ మట్టి వీరుల నుదుటన సింధూరమై మెరిసిందో, ఎక్కడ త్యాగాలు నిరంతరం దివిటీలలా వెలుగుతూ మార్గదర్శకత్వం వహించాయో, ఎక్కడ దోపిడీకి పీడనకు వ్యతిరేకంగా పిడికిళ్ళు బిగించుకొని దొరల గడీలను బద్దలు కొట్టాయో, ఎక్కడ అన్యాయం సహించలేని కళ్ళు నిప్పులు కురిపించాయో, ఎక్కడ సాయుధ పోరాట జ్వాల లు నింగికట్టుకున్నాయో అటువంటి రణక్షేత్రమైన కడివెండిలో లచ్చమ్మ, లచ్చయ్య దంపతులకు ఒక పేద చేనేత కుటుంబంలో 1926, అక్టోబర్ 2న నల్లా నరసింహులు జన్మించాడు. స్వాతంత్ర ఉద్యమానికి సారధ్యం వహించిన గాంధీ, దేశానికి రెండవ ప్రధానిగా పనిచేసిన లాల్ బహదూర్ శాస్త్రి జన్మించిన అక్టోబర్ 2వ తేదీని నల్ల నరసింహులు జన్మించి తెలంగాణ సాయుధ పోరాట నరసింహంగా వెలుగొందిన వీరుడు. యాదృచ్ఛికంగా ఈ ముగ్గురు మహోన్నతులు ఒకే తేదీన పుట్టడం కాకతాళీయం కావచ్చు కానీ వీరు దేశం గర్వించదగ్గ భరతమాత ముద్దుబిడ్డలు. ఈ ముగ్గురివి స్వతంత్ర పోరాటాలే కానీ దారులు వేరు. గాంధీ, శాస్త్రిలు దేశ దాస్య శ్రుంఖలాలు తెంచడానికి అహింసా మార్గంలో ఉద్యమిస్తే, నల్ల నరసింహులు నిజాం నిరంకుశపాలకుల నుండి దొరలు, దేశ్ముఖుల అకృత్యాల నుండి ప్రజలను రక్షించడానికి సాయుధ పందా అనుసరించాడు. తండ్రి లచ్చయ్య మంచి నైపుణ్యముగల చేనేత కళాకారుడు.

అతి సన్నని దారంతో వస్త్రాలు నేయుటలో నేర్పరి. లచ్చయ్య తయారుచేసిన వస్త్రాలకు మంచి గిరాకీ ఉండేది. ఆ రోజుల్లో హైదరాబాద్ సంస్థానం నిజాం నవాబు పాలనలో ఉండేది. జమీందారులు, జాగీర్దారులు, దేశ ముఖ్‌లు, దేశ్పాండేల ఆధీనములో గ్రామాలు ఉండేవి. వీరు ప్రజలను పన్నుల పేరుతో పీడించేవారు. గ్రామాలలో ప్రజలతో వెట్టిచాకిరి చేయించుకునేవారు. దండుగలు వేసేవారు ప్రజలను దోపిడీ చేయడమే వీరి వృత్తి. కడివెండికి ఐదు మైళ్ళ దూరంలో విసునూరులో దేశ్ముఖ్ రేపాక వెంకట రామచంద్రారెడ్డి ఉండేవాడు. ఇతడు 60 ఎకరాల భూస్వామి. దోపిడీదారుడు, దుర్మార్గుడు, ప్రజాకంటకుడు. ఇతని తల్లి జానమ్మ కడవెండిలో నివాసం ఉండేది .ఈమె బలవంతంగా ప్రజల దగ్గర నుండి పన్నులు వసూలు చేసేది. తనకున్న 20 ఎకరాల భూమిని రెండు వందల ఎకరాలు చేసిందంటే ఈమె దోపిడీ ఏ రకంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు.నల్ల నరసింహులు కడివండిలోనే ఏడో తరగతి వరకు చదువుకున్నాడు.

ఆ రోజుల్లో ఏడవ తరగతి ఉత్తీర్ణత అయిన వారికి వెంటనే టీచర్ ఉద్యోగం వచ్చేది కానీ నరసింహులు ఉద్యోగ అర్హతకు ఒక సంవత్సరం వయస్సు తక్కువగా ఉంది. ఇంకొక సంవత్సరం గడిస్తే ఉద్యోగం వచ్చేది. సరిగ్గా అదే సమయంలో తండ్రి లచ్చయ్య అనారోగ్యంతో కన్నుమూశాడు ఇంటికి పెద్దవాడు కావడం వలన కుటుంబ భారం మొత్తం నరసింహులు పైనే పడింది బతుకుతెరువుకు మగ్గం వేయడం నేర్చుకున్నాడు. తండ్రి చేసిన అప్పులు తీర్చడం కోసం పరాయి ఊరిలో ప్రైవేట్ టీచర్ గా పనిచేసి అప్పులు తీర్చాడు. పరాయి ఊరికి వచ్చి పోయే దారిలో పిట్టల నరసయ్య అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం విప్లమాత్మకమైన మార్పునకు దారి తీసింది. వారి సహకారంతో ఆంధ్ర మహాసభతో పరిచయం ఏర్పడింది.

నరసింహులు సాహిత్య అధ్యయనం చేశాడు. పోరాట చరిత్రలు చదివాడు. చైతన్యం పొం దాడు. చిన్నతనంలోనే అదే గ్రామానికి వజ్రమ్మతో అతనికి వివాహం జరిగింది. చిన్నతనం నుండి అన్యాయాలను సహించలేని మనస్తత్వం కలిగిన నల్ల నరసింహులు 1944 లో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన భువనగి రిలో నిర్వహించిన ఆంధ్ర మహాసభతో ఉత్తేజితుడై తన భార్య అయిన నల్ల వజ్రమ్మతో పాటు కడివెండి గ్రామానికి చెందిన మిత్రులు దావీద్ రెడ్డి, మచ్చ రామయ్య, మాచర్ల కొండయ్య, దొడ్డి మల్లయ్య, దొడ్డి కొమరయ్య తదితరులను సమీకరించి ఆంధ్ర మహాసభ గ్రామ శాఖ ఏర్పాటు చేశాడు .దానికి కార్యదర్శిగా పనిచేస్తూ విప్లవ ప్రస్థానాన్ని ఆరంభించాడు.

ప్రజలపై అమానవీయ చర్యలకు పాల్పడుతూ కడివెండి ప్రజల రక్త మాంసాలను పీల్చి పిప్పి చేస్తున్న జానమ్మ దొరసానికి నల్ల నర్సింహులు ముచ్చెమట పట్టించాడు .రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో లెవీ



ధాన్యం పేరు తో పేద రైతుల నుండి జరుగుతున్న బలవంతపు ధాన్య సేకరణను అడ్డుకొని జానమ్మ దొరసాని అక్రమంగా నిల్వ చేసుకున్న 100 పుట్ల ధాన్యాన్ని ప్రజలకు పంచి తొలి విజయాన్ని నమోదు చేశాడు. జీతగాళ్లతో సమ్మె చేయించాడు. సెలవులతో పాటు వారి జీతాలు భారీ స్థాయిలో పెంపుదల చేయించాడు. వెట్టి బంద్ అయింది. దండగలు లేకుండా పోయాయి. ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. ఉద్యమ ప్రస్థానంలో భాగంగా నల్ల నర్సింహులు హైదరాబాదులో ఉన్నప్పుడు ప్రతీకారంతో ఉన్న దేశముఖ్ గుండాలు కడివెండిలో ఆంధ్ర మహాసభ కార్యకర్తలపై దాడి చేశారు. ఆ దాడిలో దొడ్డి కొమురయ్య నేలకొరిగి వీర మరణం చెందాడు. ఈ ఘటన వల్ల నరసింహులుకు పీడకులపై కసితో పీడితులపై ప్రేమతో అగ్నిశిఖలా ప్రజ్వరిల్లి 60 మందితో సాయుధ దళాన్ని ని ర్మించి విప్లవ కెరటం సృష్టించాడు. నరసింహులు పిలుపు ఒక ప్రభంజనం. సాయుధ పోరాటంలోకీలకమైన నరసింహులుపై అనేక కేసులు బనాయించారు పోలీసులు. తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు కానీ నరసింహులు అనేక గ్రామాలు తిరుగుతూ తప్పించుకున్నాడు. చివరకు సూర్యాపేటలో పోలీసులకు దొరికాడు. అరెస్ట్ చేసి క్రూరంగా హింసించి మహబూబ్ నగర్ జైలు నుండి తప్పించుకున్నాడు. అక్కడనుండి విజయవాడ చేరుకొని కొ న్నాళ్లు గెరిల్లా పోరాటంలో శిక్షణ తీసుకున్నాడు. తర్వాత జనగామ తాలూకా ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నాడు .1947 ఆగస్టు 15 దేశానికి స్వాతంత్రం వచ్చిన నిజాం నవాబు భారత్ యూనియన్ లో విలీనం కావడానికి ఒప్పుకోలేదు. కమ్యూనిస్టులు హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి కొరకు పోరాటం చేశారు. ఆ క్రమంలో రజాకార్ సైన్యం ఎంతో మంది వీరులను కాల్చి చంపింది. ఆ చర్యలను ప్రతిఘటిస్తూ నరసింహులు ప్రజా పోరాటాలు చేశాడు. ఈ క్రమంలో లక్ష్మక్కపల్లిలో పట్టుబడ్డాడు. కాల్చి చంపమని సైనిక అధికారులకు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ప్రజాభిమానం, అతని భావజాలం, సిద్ధాంతం పట్ల విశ్వాసం, అవగాహన, వాదనాపటిమ, నిర్భయాన్ని, నిజాయితీగల ప్రవర్తన చూసి చలించిపోయి పోలీసులకు అప్పగించారు.

నరసింహులుపై ఆరోపించబడిన మూడు అక్రమ కేసుల్లో ముగ్గురు జడ్జిల ముందు తన కేసు తానే వాదించుకున్నాడు. న్యాయవాదులను నియమించుకునే అవకాశం ఉన్న ఉపయోగించుకోలేదు. వివిధ కేసుల్లో ఆయనకు మూడు ఉరిశిక్షల సైతం విధించారు అయితే జైలు నుంచి తప్పించుకొని తిరిగి అ జ్ఞాత జీవితం ప్రారంభించాడు. చివరిసారి 1955లో ఆయనను వడ్లకొండలో అరెస్టు చేసి ప్రభుత్వం ఉరిశిక్ష మళ్ళీ ఖాయం చేసిం ది. అయితే జాతీయ అంతర్జాతీయ స్థాయి లో ప్రజందోళనల ఫలితంగా 1959లో ఆయన విడుదలయ్యాడు. అలా జైలు నుంచి విడుదలైన చిట్టచివరి తెలంగాణ సాయుధ పోరాటయోధుడుగా నల్లమల నరసింహులు. ఆయన పోరాటాల ఫలితంగా తెలంగాణ టైగర్ పేరు ఆయనకు వచ్చింది. విప్లవ సింహంగా పిలుచుకునేవారు. 1993, నవంబర్ 5 న ఆయన మరణించాడు.

**(నేడు విప్లవ వీరుడు నల్ల నరసింహులు జయంతి)**

# పాల భద్రతపై పరీక్ష

ఉదయం నిద్రలేచిన వెంటనే ప్రతి ఇంట్లో తెరుచుకునేది పాల ప్యాకెట్. పిల్లల గ్లాసులోకి వెళ్లేది అదే. టీ, కాఫీ, పెరుగు, పాయసం. రోజువారీ ఆహారంలో పాలది కీలక స్థానం. అందుకే పాలలో కల్తీ అనేది సాధారణ వ్యాపార మోసం కాదు, ప్రజారోగ్యానికి సంబంధించిన తీవ్రమైన అంశం

**సీలు ఉంటే స్వచ్ఛతేనా?**



ప్యాకెట్‌పై కంపెనీ పేరు, సీలు ఉన్నంత మాత్రాన నాణ్యతకు శాశ్వత హామీ లభించదు. రవాణా, నిల్వ, చల్లని గొలుసు, డీలర్ స్థాయి నిర్వ హణ, ప్రాసెసింగ్ పరిశుభ్ర త, ప్రతి దశలో అప్రమత్తత అవసరం. కల్తీ పాలు తయారు చేసే అక్రమ కేంద్రాలు, నీరు లేదా ఇతర పదార్థా లు కలిపే దందాలు అప్పుడప్పుడూ బయటపడుతున్నా యి. వాటిని సాధారణ సంఘటనలుగా తీసిపారేయలేం. అయితే దేశవ్యాప్తంగా ప్రతి ప్యాకెట్ పాలు విషపూరితమని చెప్పడం కూడా సరికాదు. FSSAI 2018 జాతీయ సర్వేలో 12 నమూనాల్లో భద్రతకు సంబంధించిన ప్రత్యక్ష కల్తీ గుర్తిం చింది. అదే సమయంలో 368 నమూనా ల్లో అనుమతించిన పరిమితికి మించి అఫ్లాటాక్సిన్–M1, 77 నమూనాల్లో యాంటీబయాటిక్ అవశేషాలున్నాయి.

**ప్రమాదం ఎక్కడుంది?**

డిటర్జెంట్లు, యూరియా, హైడ్రోజన్ పెరాక్సైడ్, స్టార్చ్ వంటి పదార్థాలను కలపడం ద్వారా పాల రూపం లేదా కొంత నాణ్యతా ప్రమాణాన్ని మోసం చేయడానికి ప్రయత్నాలు జరుగుతాయి. మరోవైపు పశువుల మేత నాణ్యత, యాంటీబయాటిక్స్ దుర్వినియోగం, పరిశుభ్రత లోపాలు కూడా పాల భద్రతపై ప్రభావం చూపుతాయి. కాబట్టి కల్తీ అంటే కేవలం తెల్లటి ద్రవంలో రసాయనం కలపడం మాత్రమే కాదు. రైతు దగ్గర నుంచి వినియోగదారుడి గ్లాసు వరకు మొత్తం సరఫరా గొలుసు సురక్షితంగా ఉండాలి. ఆక్సిటోసిన్ వంటి పశువైద్య ఔషధాల అనుచిత వినియోగాన్ని కూడా అరికట్టాలి. పశువుల ఆరోగ్యం, సంక్షేమం దెబ్బతినకుండా శాస్త్రీయ పద్ధతుల్లో పాల ఉత్పత్తిని పెంచే మార్గాలే శాశ్వత పరిష్కారం

**తెలంగాణకు ప్రత్యేక కార్యాచరణ అవసరం**

హైదరాబాద్ వంటి వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో పాల డిమాండ్ పెరుగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పాలను నగర సరఫరా వ్యవస్థలోకి తీసుకునే ప్రతి దశలో నమూనా పరీక్షలు, డిజిటల్ రికార్డులు, కోల్డ్–చైన్ పర్యవేక్షణ తప్పనిసరి చేయాలి. ప్రభుత్వం చేయాల్సినవి స్పష్టంగా ఉ న్నాయి. ప్రతి జిల్లాలో మొబైల్ ఫుడ్–టెస్టింగ్ వాహనాలను విస్తరించాలి. FSSAI ఇప్పటికే Food Safety on Wheels ద్వారా తక్షణ పరీక్షలకు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్ర ప్రయోగశాలల సామర్థ్యాన్ని పెంచాలి. అధునాతన పరీక్షా పరికరాలు అందుబాటులో ఉంచాలి. అనుమానాస్పద పాల రవాణాపై ఆకస్మిక తనిఖీలు చేయాలి. ప్యాకెట్‌పై QR ఆధారిత ట్రేసబిలిటీని దశలవారీగా ప్రవేశపెట్టి, రైతు సేకరణ కేంద్రం నుంచి ప్రాసెసింగ్ ప్లాంట్, పంపిణీదారు వరకు సమాచారాన్ని భద్రపరచాలి. నేరం రుజువైన సందర్భాల్లో చట్టపరమైన చర్యలు తప్పక ఉండాలి

**ప్రజలూ అప్రమత్తం కావాలి**

వినియోగదారుడు పూర్తిగా ప్రభుత్వంపైనే ఆధారపడకూడదు. అనుమానాస్పద ప్యాకెట్‌ను ఫోటోతో సహా ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయాలి. పాలు తెల్లగా కనిపించడం మాత్రమే స్వచ్ఛతకు ప్రమాణం కాదు. పాల భద్రతకు రైతు నుంచి ప్రభుత్వం వరకు ప్రతి ఒక్కరి బాధ్యత ఉంది. ప్రజల ఆరోగ్యంతో సంబంధమున్న ఈ విషయంలో దాడులు జరిగిన తర్వాత స్పందించడం కాదు, కల్తీ జరగకుండా ముందే అడ్డుకునే వ్యవస్థ కావాలి.

ఉదయం గ్లాసులో పాలు పోసుకునే ప్రతి కుటుంబాకి ప్రభుత్వం ఇవ్వాల్సిన మొదటి హామీ ఇదే, మీరు కొంటున్నది పాలు, స్వచ్ఛమైన పాలు అని నమ్మకంగా చెప్పగలగాలి.

కొలను వెంకటేశ్వర రెడ్డి
SP Jails (Retd)

## వయో వృద్ధులను ఆదరిద్దాం
# గౌరవిద్దాం

వృద్ధులను చిన్నచూపు చూడడం, దుర్భాషలాడటం, ఇంట్లోంచి గెంటివేయడం, సామాజిక వివక్షతతో దూరం పెట్టడం లాంటి ఘటనలు నిత్యం మన ముందు జరుగుతున్న సంఘటనలను చూస్తున్నాం. ఇవి కుటుంబ వ్యవస్థలో సమాజ విలువల పతనాన్ని వ్యక్తం చేస్తున్నాయి.



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646
సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్

వృద్ధులను గౌరవించడం, వృద్ధుల సేవలను, వారి శక్తిని సమాజాభివృద్ధి, ఆర్థిక ప్రగతి మరియు రాజకీయ రంగాలలో వినియోగిస్తూ దేశ సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములు చేయాలి. వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు వైద్య సదుపాయాల కల్పన, నర్సింగ్ సేవలతో పాటు కుటుంబ సభ్యుల మరియు సమాజ ఆదరణ అతి ప్రధానమైనదిగా గుర్తించాలి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజ హితవరులు కలిసి వృద్ధులను పూలలో పెట్టి సంరక్షించుకోవాలని ఐక్యరాజ్యసమితి 1991లో75వ వ్యవస్థాపక సంవత్సరం జరుపుకుంటున్న సంవత్సరంలో తీర్మానించింది. తీర్మానం ప్రకారం 01 అక్టోబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ వయో వృద్ధుల దినాన్ని" జరుపుకోవాలని కోరింది.

ప్రపంచ వ్యాప్తంగా 65 ఏళ్లు వయస్సు దాటిన వయవృద్ధులు 703 మిలియన్లు ఉన్నారని, వీరిలో ఆసియాలో 261 మిలియన్లు మరియు యూరప్– నార్త్ అమెరికాలో 200 మిలియన్లు ఉన్నారని 2019 గణంకాలు చెబుతున్నాయి. రాబోయే మూడు దశాబ్దాలలో వీరి సంఖ్య 2050 నాటికి రెట్టింపు పై 1.5 బిలియన్(60 ఏళ్లు దాటిన వారి జనాభా 2 బిలియన్లు ) దాటవచ్చునని అంచెనా వేస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశంలోనే వృద్ధుల సంఖ్య 2050 నాటికి 1.1 బిలియన్ దాటవచ్చని అంటున్నారు. ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం నేడు 35వ "అంతర్జాతీయ వృద్ధుల" దినోత్సవం 01 అక్టోబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నాం. ఈ శుభదినాన కుటుంబ సభ్యులు తాత అమ్మమ్మలను ప్రత్యేకంగా ఆదరించడం వారి పట్ల సాహనుభూతి ప్రదర్శించడం పిల్లలు తాత అమ్మమ్మలతో సరదాగా గడపడం వృద్ధాశ్రమాలను సందర్శించడం వృద్ధుల పట్ల సమాజ బాధ్యతలను గుర్తు చేయడం లాంటి కార్యక్రమాలను చేపట్టాలి. అంతర్జాతీయ వయోవృద్ధుల దినం–2020 థీమ్ గా' విశ్వ మహమ్మారీ కాలంలో వృద్ధుల సంరక్షణ మార్గాలు' తీసుకున్నారు. 2020–2030 దశాబ్దాన్ని "ఆరోగ్యకర వయోవృద్ధుల దశాబ్దం" గా నామకరణం చేసి, ఆ దిశలో ఐరాస పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

ప్రస్తుతం అపార అనుభవం విజ్ఞానం వివేకం కలిగిన వయోవృద్ధులను అనారోగ్య సమస్యల నుండి కాపాడుకోవాల్సిన కనీస బాధ్యత మనందరి మీద ఉన్నది. అభివృద్ధి చెందిన మరియు చెందుతున్న దేశాల వయోవృద్ధుల ఆరోగ్య స్థితిలో అంతరం ఎక్కువగా ఉంది. అభివృద్ధిలో వెనుకబడిన దేశాల వయోవృద్ధులకు వైద్య ఆరోగ్య వసతుల కల్పన మరియు నర్సింగ్ సేవలను కల్పించే ప్రయత్నాలు మరింత ముమ్మరంగా చేపట్టాలి. నేడు 5 ఏళ్ల లోపు బాల జనాభా కన్నా 60 ఏళ్లు దాటిన వృద్ధుల జనాభా ఎక్కువగా ఉంది. 2030 నాటికి వృద్ధుల జనాభాతో పోల్చితే 15 నుండి 24 సంవత్సరాల వయసు గల యువత జనాభా తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. నేడు కుటుంబాలు సమాజం ఆదరించి వారి అపార అనుభవ సారాన్ని పరిణలోనికి తీసుకుంటూ దేశాభివృద్ధిలో వారిని భాగస్వాములు చేయడం ఉత్తమమని భావించాలి. యువతలోని శారీరక శక్తి మరియు పెద్దలలోని అనుభవ మానసిక శక్తి కలిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని మరువరాదు.

ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు సమాజ హితవరులు కలిసి వృద్ధులను పూల లో పెట్టి సౌరక్షించుకోవాలి. ఆరోగ్యకర మానవ సంబంధాలు గల కుటుంబాల్లో ఆశావా దృక్పథంతో జీవించే వృద్ధులు 7.5 ఏళ్లు ఎక్కువగా జీవిస్తారని విశ్లేషణలు తెలుపుతున్నాయి. కుటుంబ మరియు సమాజ నిరాదరణలో వృద్ధుల జీవితకాలం తగ్గుతుంది. ప్రభుత్వ యంత్రాంగాలు చట్టసభలు చట్టాల అమలు స్వచ్ఛంద సంస్థలు ప్రజలు మరియు కుటుంబాలు తమ తమ విధులను కచ్చితంగా నిర్వహించిన నాడు వృద్ధులు మనకు మానసిక ధైర్యమే కాకుండా సంపద సృష్టిలో దోహదపడతారానడంలో అతిశయోక్తి లేదు.

వృద్ధులను నిర్లక్ష్యం చేసిన కుటుంబ సభ్యులను చట్టరీత్యా శిక్షించడం, వారికి ప్రత్యేక ఉచిత వైద్య సదుపాయాలను కల్పించడం, పౌరుల కర్తవ్యాలను గుర్తు చేయడం నిరంతరం జరగాలి. వృద్ధుల విజ్ఞాన వివేకాలను ప్రాధాన్యతలను తాత బామ్మల సహచర్యాల ఉపయోగాలను మరియు వారి బాధ్యతలను వివరించాలి. తమ జీవితకాలంలో వృద్ధులు సాధించిన ఘనతలను వారు పొందిన పురస్కారాలను సమాజాభివృద్ధిలో వారి పాత్రలను స్మరించుకోవలసిన రోజుగా అంతర్జాతీయ వృద్ధుల దినాన్ని మలుచుకోవాలి. వృద్ధులు సమాజానికి భారం కాదని వారి బహుముఖీన అనుభవం జాతి సంపదని గుర్తించాల్సిన సందర్భం ఇది. నేటి బాలలు రేపటి పౌరులే కాదు, నేటి యువకులే రేపటి వృద్ధులని గుర్తించుకోవాలి.

**(అక్టోబర్ 1 అంతర్జాతీయ, వయోవృద్ధుల దినం సందర్భంగా)**



## సాయంత్రం యోగా



ఒత్తిడి, ఆందోళనతో నిద్ర సరిగా పట్టని వారికి తేలికపాటి యోగా ఉపయోగపడవచ్చు. నెమ్మదిగా చేసే యోగా, శరీరాన్ని సాగదీయడం, నియంత్రిత శ్వాస వల్ల శరీరం, మనసు ప్రశాంతంగా మారుతాయి. రోజంతా కూర్చొని పనిచేయడం వల్ల మెడ, భుజాలు, వీపు, నడుము వంటి ప్రాంతాల్లో ఏర్పడే బిగుతును కూడా కొన్ని యోగా వ్యాయామాలు తగ్గించడంలో సహాయపడతాయి. అందుకే సాయంత్రం తేలికపాటి యోగాను రోజువారీ అలవాటుగా చేసుకోవచ్చు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 02.10.2026
www.mudranews.in | @mudranews



### టమాటా గుజ్జుతో ట్యాన్‌కు చెక్

పండిన టమాటాను గుజ్జుగా చేసి ముఖానికి అప్లై చేయాలి. 15 నిమిషాల తర్వాత కడిగేయాలి. సెన్సిటివ్ స్కిన్ ఉన్నవారు టమాటా గుజ్జులో పెరుగు లేదా తేనె కలుపుకోవచ్చు.



# కొత్త టెక్నాలజీతో టోల్‌ప్లాజాలు..

### తమిళనాడులో వాహనాలు ఆగకుండానే చెల్లింపులు

**ముద్ర, డెస్క్:** ఎంత ఫాస్టాగ్ వాడుతున్నా టోల్ ప్లాజాల దగ్గర కొన్ని క్షణాలపాటైనా ఆగాల్సిందే. టోల్‌ప్లాజాల దగ్గర చెల్లింపుల సమయంలో వాహనాలు ఆగేందుకు బ్యారియర్లు ఉంటాయి. అయితే, తమిళనాడులో అసలు వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండానే చెల్లింపులు చేయవచ్చు. టోల్‌ప్లాజా దగ్గర బ్యారియర్లు కూడా తీసేశారు. ఇది తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజా వద్ద అమలవుతున్న కొత్త టెక్నాలజీ వ్యవస్థ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఈ వ్యవస్థను ఏర్పాటు చేసింది. తమిళనాడులోని తాంబరం-టిండివనం పట్టణాల మధ్య గల పరనూర్ వద్ద 45వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజాలో ఈ విధానం అమలవుతోంది. ఇది 46.5 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారి. అక్టోబర్ 1, గురువారం నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇక్కడి టోల్‌ప్లాజాను మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్) కింద అభివృద్ధి చేయడంతో ఈ టోల్‌ప్లాజా దగ్గర వాహనాలు ఆగకుండా నేరుగా వెళ్లిపోవచ్చు. అయితే, ఇదే మొదటి బ్యారియర్ ఫ్రీ టోల్‌ప్లాజా కాదు. ఇంతకుముందు ముంబై నేషనల్ హైవే 48పై, సూరత్-భరూచ్ మధ్య కామ్రేజ్-చోర్యాసి మధ్య ఉన్న టోల్‌ప్లాజాలో గత మే నుంచే ఈ విధానం అమలవుతోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఇతర టోల్‌ప్లాజాలకు కూడా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. వాహనాలన్నీ ఫాస్టాగ్‌తో లింకై ఉంటాయన్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ఫాస్టాగ్‌ను రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీతో అనుసంధానం చేశారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ టెక్నాలజీ ద్వారా ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్.. ఫాస్టాగ్‌ను గుర్తిస్తుంది. అలాగే, కెమెరాలు వాహన రిజిస్ట్రేషన్ నెంబర్‌ను గుర్తిస్తాయి. ఈ ఫాస్టాగ్, వాహన నెంబర్ ఆధారంగా ఆటోమేటిగ్గా చెల్లింపు జరిగిపోతుంది. దీంతో వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోవచ్చు. అయితే, ఫాస్టాగ్‌లో తగినంత బ్యాలెన్స్ ఉండటం తప్పనిసరి. టోల్‌ప్లాజాల దగ్గర వాహనాల భారీ క్యూలైన్లు, నెమ్మదిగా కదిలే పరిస్థితిని తగ్గించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఈ విధానాన్ని ప్రవేశపెడుతోంది.



## 'సర్' పై ఈసీఐ సెక్రటరీ నవీన్ కుమార్ సమీక్ష



**ముద్ర, శేరిలింగంపల్లి:** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యదర్శి నవీన్ కుమార్ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో రంగారెడ్డి మరియు సంగారెడ్డి జిల్లాల ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్-2026) ప్రగతిపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ మరియు, ఈఆర్ఓ అమిత్ నారాయణ్ నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికల విధులను వివరించారు. ఓటర్లకు చేరాల్సిన నోటీసులను ఎలాంటి ఆలస్యం లేకుండా 100% పంపిణీ పూర్తి చేయాలని, మ్యాపింగ్ లేని మరియు తార్కిక వ్యత్యాసాలు ఉన్న కేసులపై విచారణను సకాలంలో పూర్తి చేయాలి ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి, పత్రాలను సేకరించి వెంటనే ఈసీఐ నెట్‌లో అప్‌లోడ్ చేయాలి. పేదలు మరియు నిరాశ్రయుల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను మరింత బలోపేతం చేయాలి సూచించారు. ఈ సమావేశంలో అదనపు సీఈఓ వాసం వెంకటేశ్వర్లు, రంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, సంగారెడ్డి అదనపు కలెక్టర్, పటాన్‌చెరు ఈఆర్ఓ మరియు ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## మహారాష్ట్రలో విషాదం..

### బీచ్‌లో మునిగి ఎనిమిది మంది కాలేజీ విద్యార్థులు మృతి



**ముద్ర, ముంబై:** మహారాష్ట్రలో ఘోర విషాదం జరిగింది. సరదాగా బీచ్‌కు పిక్నిక్ వెళ్లిన ఎనిమిది మంది విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. వారి మృతదేహాలను అధికారులు వెలికితీశారు. ఈ ఘటన మహారాష్ట్ర, రాయ్‌గఢ్ జిల్లాలోని దివేగర్ బీచ్‌లో గురువారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. పూనే జిల్లాలోని అలాండిలోని ఒక ప్రైవేటు కోచింగ్ సెంటర్‌కు చెందిన కొందరు 11, 12 తరగతుల విద్యార్థులు రాయ్‌గఢ్ శ్రీవర్ధన్ తాలూకాలోని దివేగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వచ్చారు. ఇది స్థానికంగా చాలా ప్రముఖమైన పర్యాటక కేంద్రం. మొత్తం 48 మంది విద్యార్థులు ఈ బీచ్‌కు వచ్చారు. వీరిలో 25 మంది అబ్బాయిలు, 17 మంది అమ్మాయిలు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. బీచ్‌కు వచ్చిన తర్వాత సముద్ర జలాల్లో ఆడుకునేందుకు కొందరు విద్యార్థులు నీళ్లలోకి వెళ్లారు. ఈ క్రమంలో నీటి లోతును, అలలను అంచనా వేయలేకపోవడంతో ఆ నీటిలోనే కొట్టుకుపోయారు. ఎనిమిది మంది విద్యార్థులు మునిగిపోవడంతో టీచర్లు, తోటి విద్యార్థులు వెంటనే స్థానికులు, రెస్క్యూ బృందాలను అలర్ట్ చేశారు. వారు వేగంగా స్పందించి రంగంలోకి దిగారు. అక్కడే ఉన్న మహాకాళి వాటర్ స్పోర్ట్స్ ఎంప్లాయిస్, టూరిస్టులు, స్థానికులు కలిసి గల్లంతైన వారి కోసం గాలించారు. ఈ క్రమంలో ఎనిమిది మంది మృతదేహాలను గుర్తించి, వెలికితీశారు. మృతదేహాల్ని బొర్లి పంచతన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. సముద్రంపై వారికి అవగాహన లేకపోవడం, లోతును, అలలను అంచనా వేయలేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంపై మహారాష్ట్ర మంత్రి నితీష్ రానే సంతాపం వ్యక్తం చేశారు.

# ఫ్లైదుబాయ్ విమానానికి ప్రమాదం ఎలా తప్పిందంటే?

### 30 వేల అడుగుల ఎత్తులో ఐదు అద్భుతాలు..

**ముద్ర, న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ ఫ్లైట్‌లో ఐదు మిరాకిల్స్ జరిగాయి. దీంతో హైజాకింగ్ వంటి ఉగ్రవాద కుట్రతోపాటు కూలే ప్రమాదం నుంచి ఆ విమానం బయటపడింది. ఆ ఫ్లైట్‌లోని ఐదుగురు హీరోలు సకాలంలో స్పందించారు. ఘోర విమాన ప్రమాదాన్ని వారు తప్పించారు. సెప్టెంబర్ 30న ఫ్లైదుబాయ్‌కు చెందిన ఎఫ్‌జెడ్ 1073 విమానం 174 మంది ప్రయాణికులతో దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరింది. ఆ విమానం 30,000 అడుగుల ఎత్తులో ఎగురుతుండగా ఒమన్ దేశస్థుడైన కో-పైలట్ హైజాకింగ్ ప్రయత్నం చేశాడు. భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై పదునైన ఆయుధంతో దాడి చేశాడు. కాక్‌పిట్‌లో జరుగుతున్న ఈ దాడి కారణంగా ఆ విమానం అదుపుతప్పింది. సుమారు రెండు నిమిషాల్లో 17,000 అడుగుల మేర కిందకు దిగింది. కూలేందుకు వేగంగా భూమి మీదకు అది దూసుకెళ్లసాగింది. దీంతో అందులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనతో హాహాకారాలు చేశారు. కాగా, ఫ్లైదుబాయ్ ఫ్లైట్ కూలే ప్రమాదం అంచున ఉన్న సమయంలో ఐదు అద్భుతాలు జరిగాయి. కో పైలట్ దాడిలో తీవ్రంగా గాయపడిన భారత కెప్టెన్ మచ్చర్ నేలపై పడి ఉన్నప్పటికీ, కాక్‌పిట్ డోర్‌ను అన్‌లాక్ చేయగలిగారు. సహాయం కోసం ఆయన కేకలు వేశారు. ఆ విమానంలో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు వెంటనే స్పందించారు. ప్లంబర్ అయిన యానివ్ హయున్, దంత వైద్యుడైన డాక్టర్ షోటా ముసయేవ్, బీమా ఏజెన్సీ యజమాని అయిన అస్సాఫ్ రజువాన్, బ్యాంకర్ అయిన జ్వికా మాన్స్ చాలా సాహసోపేతంగా వ్యవహరించారు. ఈ ఐదుగురు వెంటనే కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లారు. ఆ విమానంలో ప్రయాణికులకు ఇచ్చిన హెడ్‌ఫోన్‌ల కేబుళ్లను ఉపయోగించి కో-పైలట్‌ను నియంత్రించారు. విమానం కంట్రోల్ ప్యానెళ్లను పాడుచేయడానికి అతడు చేసిన ప్రయత్నాన్ని అడ్డుకుని బంధించారు. అదే సమయంలో దంత వైద్యుడైన డాక్టర్ షోటా ముసయేవ్, భారత కెప్టెన్ మచ్చర్ ప్రాణాలు కాపాడేందుకు ఉపక్రమించారు. రక్తస్రావాన్ని ఆపి ఆయన పరిస్థితిని స్థిరంగా ఉంచడంపై దృష్టిసారించారు.

మరోవైపు విమానయాన కార్యక్రమాల టీవీ షోలను ఆసక్తిగా చూసే ఇజ్రాయెలీ ప్లంబర్ యానివ్ హయున్ చాలా కీలకంగా వ్యవహరించారు. పైలట్‌గా ఎలాంటి శిక్షణ లేనప్పటికీ తనకు ఉన్న పరిజ్ఞానంతో తక్షణం స్పందించారు. ప్రమాదకరంగా కిందకు దూసుకెళ్తున్న విమానాన్ని కంట్రోల్ చేశారు. స్టీరింగ్ లివర్లను పైకి లాగాలని తెలియడంతో ఆ పని చేశారు. దీంతో ఆ విమానం తిరిగి నియంత్రణలోకి వచ్చింది. అదృష్టవశాత్తు విధుల్లో లేని ఇద్దరు పైలట్లు ఆ విమానంలో ప్రయాణిస్తున్నారు. వారిద్దరూ వెంటనే పైలట్ బాధ్యతలు చేపట్టారు. సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయానికి విమానాన్ని మళ్లించి అత్యవసరంగా ల్యాండ్ చేశారు.

అయితే వేలాది అడుగుల ఎత్తు కోల్పోవడంతో ఆ విమానం తోక భాగానికి భారీగా నష్టం జరిగింది. తోక భాగంలోని కీలకమైన రడ్డర్‌లో చాలా భాగం విరిగిపోయింది. అయినప్పటికీ ఆ విమానం సురక్షితంగా ల్యాండ్ కావడం చివరి అద్భుతం. తోక భాగానికి భారీ నష్టం వాటిల్లినా విమానం కూలిపోకపోవడం చూసి విమానయాన నిపుణులు సైతం ఆశ్చర్యపోయారు. 9/11 తరహాలో విమానాన్ని కూల్చివేసే ప్రయత్నాన్ని నిరోధించిన ఈ ఐదుగురు హీరోలను అందరూ ప్రశంసించారు.



### కేంద్ర ప్రభుత్వ ఉన్నత కొలువుల నియామక సంస్థ

# యూపీఎస్సీకి వందేళ్లు




**ముద్ర, న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఎన్నింటినో భర్తీ కోసం నియామకాలు చేపట్టే యూపీఎస్సీకి నేటితో వందేళ్లు నిండాయి. ఈ సందర్భంగా ఢిల్లీలో శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC)ను లీ కమిషన్ (1924) సిఫారసుల ప్రకారం 1926, అక్టోబర్ 1న ఏర్పాటు చేశారు. దీనికి తొలి ఛైర్మన్‌గా రాస్ బార్కర్ వ్యవహరించారు. నేటి (2026, అక్టోబర్ 1)తో వందేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వం శతాబ్ది ఉత్సవాలు నిర్వహించింది. ప్రభుత్వ చట్టం 1935 ప్రకారం 1937లో దీన్ని ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా పేరు మార్చారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత 1956, జనవరి 26న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా మార్చారు. భారత రాజ్యాంగంలోని 14వ భాగంలో ఆర్టికల్ 315 నుంచి 323 వరకు యూపీఎస్సీ అధికారాలు, నిబంధనలను పొందుపరిచారు. యూపీఎస్సీ శతాబ్ది వేడుకలను ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రత్యేక తపాలా బిళ్ల, స్మారక నాణేన్ని విడుదల చేశారు. అదేవిధంగా ఒక పుస్తకాన్ని విడుదల చేశారు.

## వ్యాపారవేత్తను డిజిటల్ అరెస్టు పేరుతో రూ.7 కోట్లు బురిడీ కొట్టించిన వ్యక్తి అరెస్టు



**ముద్ర, డెస్క్**

లుథియానాకు చెందిన వ్యాపారవేత్త ఎస్‌పీ ఓస్వాల్‌ను డిజిటల్ అరెస్టు చేసి 7 కోట్లు కాజేసిన కేసులో కోల్‌కతాకు చెందిన సోహెల్ అక్తర్ అలియాస్ రాజును కోల్‌కతాలో అరెస్టు చేశారు. జలంధర్‌కు చెందిన ఈడీ అతన్ని అదుపులోకి తీసుకున్నది. మనీల్యాండరింగ్ చట్టం కింద అక్తర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఈడీ పేర్కొన్నది. ట్రాన్సిట్ రిమాండ్‌కు కోల్‌కత్తా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో అతన్ని జలంధర్‌కు తీసుకెళ్లారు. అక్టోబర్ 6 వరకు అతన్ని రిమాండ్‌లోకి తీసుకున్నారు. ఏడు కోట్ల డిజిటల్ అరెస్టు కేసులో డబ్బులను ఎక్కడికి తరలించారో దర్యాప్తులో తేల్చనున్నారు. లుథియానాకు చెందిన వర్ధమాన్ గ్రూపుకు ఓస్వాల్ ఛైర్మన్‌గా ఉన్నారు. 2023 ఆగస్టులో అతన్ని డిజిటల్ అరెస్టు చేశారు. సీబీఐ ఆఫీసర్లమని చెప్పి అతని నుంచి ఏడు కోట్లు వసూల్ చేశారు. లుథియానా సైబర్ క్రైం పోలీసులు రిజిస్టర్ చేసిన కేసులో ఈడీ దర్యాప్తు చేపట్టింది.

## యూట్యూబర్ రావణ్‌కు కృష్ణ జిల్లా కోర్టు షాక్..

### కేసు దర్యాప్తు 30 రోజులు వాయిదా..!

**ముద్ర, డెస్క్**

యూట్యూబర్ ప్రశ్న రావణ్ పై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద నమోదైన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తు గడువును మరో 30 రోజులపాటు పొడిగిస్తూ కృష్ణా జిల్లా కోర్టు ఈరోజు కీలక ఉత్తర్వులు జారీచేసింది. వివరాల్లోకి వెళ్తే ప్రశ్న రావణ్‌పై నమోదైన ఉపా కేసులో చట్ట ప్రకారం నిర్దేశించిన 90 రోజుల దర్యాప్తు గడువు రేపటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేసులో మరింత లోతైన విచారణ జరిపి కీలక ఆధారాలు సేకరించేందుకు అదనపు సమయం అవసరమని దర్యాప్తు అధికారులు భావించారు. ఈ మేరకు గడువును పొడిగించాలని కోరుతూ కృష్ణా జిల్లా కోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం దర్యాప్తు అధికారుల విజ్ఞప్తిని అంగీకరించింది. విచారణ పూర్తి చేయడానికి మరో 30 రోజుల గడువు ఇస్తూ ఆదేశాలు జారీచేసింది. రావణ్ మావోయిస్టు భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాడని, సాయుధ విప్లవానికి మద్దతు ఇస్తున్నాడని జనసేన నేత ఒకరు చేసిన ఫిర్యాదు మేరకు జూలై నెలలో పోలీసులు రావణ్‌ను అరెస్టు చేసి ఉపా కేసు నమోదు చేశారు. తాజా ఉత్తర్వులతో దర్యాప్తు అధికారులు విచారణను కొనసాగించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

## జ్ఞానేష్ కుమార్ కాదు.. వ్యానిష్ కుమార్..

### సీఈసీపై మమతా బెనర్జీ విమర్శ

**ముద్ర, డెస్క్**



సర్ విషయంపై, సీఈసీ జ్ఞానేష్ కుమార్ అంశంపై వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఓట్లను, ఓటర్ల హక్కులను సీఈసీ జ్ఞానేష్ కుమార్ తొలగిస్తున్నాడని, అందువల్ల అతడు జ్ఞానేష్ కుమార్ కాదని, వ్యానిష్ కుమార్ అంటూ అభివర్ణించారు. వ్యానిష్ అంటే తొలగించడం, కనిపించకుండా పోవడం వంటి అర్థాలున్న సంగతి తెలిసిందే. జ్ఞానేష్ కుమార్ సర్ ద్వారా ఓట్లను తొలగిస్తుండటంతో మమత ఆయనను ఇలా పోల్చారు. అలాగే, సర్ ప్రక్రియ సహా వివిధ అంశాలపై ఆమె మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో తాము వ్యతిరేకించే వరకు సర్ అంశంపై ఎవరూ మాట్లాడలేదన్నారు. సర్ ద్వారా ఓట్లు కోల్పోయిన వారితో కలిసి తాము ఎన్నికల సంఘాన్ని కలిసినప్పుడు వారు తమను అవమానించారని గుర్తు చేశారు. ఇదే సమయంలో జ్ఞానేష్ కుమార్‌ను తొలగించకుండా రక్షణ కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేశారని మమత గుర్తు చేశారు. అయితే, 147 మంది ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేసిన అనంతరం ఈ బిల్లును కేంద్రం ఆమోదించిందన్నారు. తమకు మద్దతుగా ఉన్న ప్రాంతాల్లో సర్ పేరిట ఓట్లు తొలగించారని మమత ఆరోపించారు. సర్ తర్వాత ఓటరు లిస్టులో పేరు లేని వారికి పశ్చిమ బెంగాల్‌లో రేషన్ కూడా అందడం లేదని విమర్శించారు. సర్ బాధితులకు ఇతర ప్రభుత్వ పథకాలు కూడా అందడం లేదన్నారు. ఎన్నికల ప్రక్రియను సీమా ఖన్నా, వ్యానిష్ కుమార్ హైజాక్ చేశారని, ఎన్నికల ప్రక్రియ మొదలవ్వడానికి ముందే ఈవీఎంల ద్వారా గెలుపును ఖాయం చేసుకున్నారని మమత ఆరోపించారు.

## వారానికి క్రమం తప్పకుండా ఫేస్ ప్యాక్‌లు

ట్యాన్ తగ్గించుకోవాలంటే ఒక్కసారి ఉపయోగించి ఫలితం కోసం ఎదురుచూడకుండా, చర్మానికి సరిపోయే ప్యాక్‌ను క్రమం తప్పకుండా ఉపయోగించడం మంచిది. కొత్త ప్యాక్‌ను ముఖానికి పూర్తిగా అప్లై చేసే ముందు చిన్న ప్రాంతంలో ప్యాచ్ టెస్ట్ చేయడం సురక్షితం.



## పైలట్ స్మిత్ మచ్చర్ ఆరోగ్యంపై భారత ఎంబసీ కీలక ప్రకటన



**ముద్ర, న్యూఢిల్లీ :** ఫ్లైదుబాయ్ విమానంలో కో–పైలట్ చేతిలో గాయపడ్డ భారత పైలట్ స్మిత్ మచ్చర్ ఆరోగ్యంపై యూఏఈలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. పైలట్ స్మిత్ మచ్చర్ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారని, వేగంగా కోలుకుంటున్నారని భారత రాయబారి దీపక్ మిత్తల్ తెలిపారు. యూఏఈలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మచ్చర్ ను దీపక్ మిత్తల్.. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పరామర్శించారు. ఈ విషయాన్ని భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. "కెప్టెన్ మచ్చర్ ఆరోగ్యంగా ఉన్నారు. బాగా కోలుకుంటున్నారు. కొనసాగుతున్న వైద్య చికిత్స, ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేందుకు స్థానిక అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నాం." అని వెల్లడించింది. ఘటన జరిగిన అనంతరం మచ్చర్ ను తొలుత వాయవ్య సౌదీ అరేబియాలోని టబుక్ లో ఆసుపత్రిలో చేర్చారు. అనంతరం ఒక రోజు తర్వాత మెరుగైన వైద్య చికిత్స కోసం ఆయనను యూఏఈకి తరలించారు.

కో–పైలట్ తో జరిగిన ఘర్షణలో మచ్చర్ తీవ్రంగా గాయపడ్డారు. అయినప్పటికీ ఆయన విమానాన్ని నియంత్రించేందుకు, పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. బుధవారం రాత్రి రియాద్ లోని భారత రాయబార కార్యాలయం మచ్చర్ టబుక్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించింది. అప్పటికి ఆయన పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపింది. తాజాగా యూఏఈలో భారత రాయబారి మిత్తల్ ఆయనను పరామర్శించిన అనంతరం.. మచ్చర్ ఆరోగ్యంగా ఉన్నారని, కోలుకుంటున్నారని రాయబార కార్యాలయం వెల్లడించింది.

ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కో–పైలట్ ఒమన్ జాతీయుడిగా గుర్తించారు. ఈ ఘటన అనంతరం విమానం అత్యంత వేగంగా కిందికి దిగింది. 30 సెకన్లలోపే దాదాపు 14,000 అడుగుల ఎత్తు కోల్పోయినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే మచ్చర్ తీవ్రంగా గాయపడినప్పటికీ కాక్ పిట్ తలుపు తెరిచి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రతినిధి డోరన్ స్పీల్ మన్ పేర్కొన్న వివరాలను ఉటంకిస్తూ ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ కథనం ప్రచురించింది. మచ్చర్ రక్తసిక్త స్థితిలో ఉన్నప్పటికీ తన దగ్గర మిగిలిన శక్తినంతా ఉపయోగించి కాక్ పిట్ తలుపు తెరిచినట్లు అందులో పేర్కొన్నారు. కాక్ పిట్ లో జరిగిన ఘటనను అదుపులోకి తీసుకున్న అనంతరం విమానాన్ని టబుక్ కు మళ్లించారు. అక్కడ అత్యవసర ల్యాండింగ్ చేశారు. అనంతరం విమానంలోని ప్రయాణికులు సురక్షితంగా ఇజ్రాయెల్ చేరుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కో–పైలట్ విమానాన్ని ప్రమాదానికి గురిచేయాలనే ఉద్దేశంతోనే దాడి చేశాడా? ఘటనకు కారణం ఏమిటి? అనే అంశాలపై దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది.

## నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి.. వృద్ధుడికి జీవిత ఖైదు

**ముద్ర, హైదరాబాద్**: నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి కేసులో వృద్ధుడికి జీవితఖైదు విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు ఇచ్చింది. గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న జి.నారాయణ(76) అదే ప్రాంతంలోని చిన్నారి(4)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో 28 జూన్ 2025న గోల్కొండ పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

## బోధన్, చేర్యాల మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలు

**ముద్ర, హైదరాబాద్:** పదవీకాలం ముగిసిన నిజామాబాద్ జిల్లా బోధన్, సిద్దిపేట జిల్లా చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీలకు తెలంగాణ ప్రభుత్వం నూతన పాలకవర్గాలను నియమించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన పాలకవర్గాల పదవీకాలం రెండేళ్లుగా ఉండనుంది. బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దేవభక్తుని నాగేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా నరేందర్ రెడ్డి నియమితులయ్యారు. అలాగే చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొమ్మూరి ప్రశాంత్, వైస్ చైర్మన్‌గా బోయిని శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు మార్కెట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పంటల కొనుగోలు, నిల్వ, విక్రయ ప్రక్రియల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నూతన పాలకవర్గాలు రైతుల సమస్యల పరిష్కారంతో పాటు మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తూకం, నిల్వ, వేలం ప్రక్రియలను మరింత పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. నూతన చైర్మన్లు, వైస్ చైర్మన్లకు అభినందనలు తెలిపిన తుమ్మల.. రైతులకు అంకితభావంతో సేవలందించాలని ఆకాంక్షించారు.

## కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు

**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్రంలో కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ చర్యలను మరింత పటిష్టం చేయాలని టీజీపీసీబీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి లక్కడి అధికారులను ఆదేశించారు. బుధవారం సనత్‌నగర్‌లోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో మెంబర్ సెక్రటరీ రవితో కలిసి జోనల్, రీజినల్, డివిజనల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాలుష్య నివారణకు ముందస్తు చర్యలతో పాటు ఫలితాల ఆధారిత కార్యాచరణ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. పరిశ్రమలపై నిరంతర తనిఖీలు నిర్వహించి పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది కొరత సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వ్యర్థాల నిల్వ ట్యాంకులను సీజ్ చేయాలని మెంబర్ సెక్రటరీ రవి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రఘు, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శకుంతల, పలువురు పిసిబి ప్రధాన కార్యాలయ అధికారులు, హైదరాబాద్, రామచంద్రాపురం జోనల్ కార్యాలయాల అధికారులు, రామచంద్రపురం, వరంగల్ జోనల్ లేబొరేటరీ అధికారులు, రీజనల్ కార్యాలయాల అధికారులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాద్ నగరవాసులకు గుడ్ న్యూస్..

## - మెట్రో, ఆర్టీసీకి ఒకే పాస్

- మెట్రో, ఆర్టీసీకి ఉమ్మడి పాస్‌లు
- డైలీ పాస్ రూ.400.. నెలవారీ రూ.8,500

'మీ టికెట్' యాప్‌తో డిజిటల్ టికెటింగ్

- ఫోన్‌లోనే బస్ టికెట్లు, పాస్‌లు





**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ప్రతినిత్యం ప్రయాణించే పౌరులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. నగర ప్రజా రవాణాను మరింత సులభతరం చేసేందుకు మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ఒకే పాస్‌తో ప్రయాణించేలా 'కామన్ పాస్' (ఉమ్మడి పాస్) విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సరికొత్త ఉమ్మడి పాస్ వ్యవస్థతో పాటు అప్‌గ్రేడ్ చేసిన 'మీ టికెట్' (MeeTicket) మొబైల్ యాప్‌ను రేపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అధికారికంగా ప్రారంభించనున్నారు. ఒకే పాస్‌తో రెండు ప్రధాన రవాణా వ్యవస్థల్లో ప్రయాణించే వెసులుబాటు కలగడంతో నగరవాసులకు ప్రయాణ ఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా గణనీయంగా ఆదా కానుంది.

**రోజువారీ, నెలవారీ జాయింట్ పాస్ ధరలు ఖరారు**

ఈ ఉమ్మడి పాస్ విధానంలో భాగంగా ఆర్టీసీ, మెట్రో సర్వీసులను అనుసంధానిస్తూ రోజువారీ , నెలవారీ పాస్‌లను ప్రభుత్వం ఖరారు చేసింది. రోజువారీ జాయింట్ పాస్ ధరను రూ. 400గా నిర్ణయించగా, నెలవారీ జాయింట్ పాస్ ధరను రూ. 8,500గా ఖరారు చేశారు. ఈ జాయింట్ పాస్ ఉన్న ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు , మెట్రో రైళ్లలో సులువుగా ప్రయాణించవచ్చు. నిత్యం ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం నగరం నలుమూలలకూ రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఈ పాస్‌లు ఎంతో ప్రయోజనకరంగా మారనున్నాయి.

**ఆర్టీసీలో ఆన్‌లైన్ డిజిటల్ టికెటింగ్.. 'మీ టికెట్' యాప్ ద్వారా సేవలు**

నగర రవాణాలో మరో కీలక మార్పుగా ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ టికెటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. కండక్టర్ ప్రమేయం లేకుండా, పేపర్ టికెట్ అవసరం లేకుండా ప్రయాణికులు తమ మొబైల్‌లోనే నేరుగా టికెట్ పొందేలా ఈ సదుపాయాన్ని రూపొందించారు. అప్‌గ్రేడ్ చేసిన 'మీ టికెట్' మొబైల్ యాప్ ద్వారా రోజువారీ టికెట్, డే పాస్‌లతో పాటు ఆర్టీసీ కొత్తగా తెచ్చిన వారం రోజుల పాస్ , నెలవారీ బస్ పాస్‌లను నేరుగా ఫోన్ నుంచే పొందే వెసులుబాటు కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రయాణికులకు వేగవంతమైన, పారదర్శకమైన రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సంస్కరణలు చేపట్టింది.

### ప్రజా సమస్యలను పరిష్కరించాలని

## బీజేపీ ఆందోళన

**ముద్ర, కరీంనగర్ :** ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పురపాలక పరిధిలో పేరుకుపోయిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భాజపా పట్టణ శాఖ ఆధ్వర్యంలో నేతలు ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనుప్రావ్, పట్టణ అధ్యక్షుడు దొనికెల నవీన్, పుర కౌన్సిలర్లు బొడ్ల ఆనంద్, వేణుగోపాల్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## చిగురుమామిడిలో రోడ్డు విస్తరణ బాధితుల రిలే నిరాహార దీక్ష

* రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య..



**ముద్ర, చిగురుమామిడి:** మండల కేంద్రంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో బాగా ఇండ్లు కోల్పోతున్న బాధితులు గురువారం రిలే నిరాహార దీక్షలకు దిగారు.రహదారి విస్తరణలో భాగంగా తాము ఇండ్లు,ఇండ్ల స్థలాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ బాధితులు మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఫోర్ లైన్ నిర్మాణంతో గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న సుమారు 300 కుటుంబాలు ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎంతో కష్టపడి కట్టుకున్న ఇండ్లు కూల్చివేస్తే, తాము,తమ కుటుంబాలు రోడ్డు పాలు అవుతామని ఆవేదన వ్యక్తం చేశారు.ఇండ్లు కూల్చివేతకు గురవుతున్న బాధితులందరికీ ప్రభుత్వం వెంటనే సముచితమైన నష్టపరిహారం చెల్లించాలన్నారు.

ఒకవేళ ప్రభుత్వం పరిహారం చెల్లించలేని పక్షంలో, ప్రత్యామ్నాయంగా గ్రామం వెలుపల నుండి బైపాస్ రోడ్డు నిర్మించి తగిన న్యాయం చేయాలని కోరారు.దీక్షా శిబిరంలో బాధితులు నాలుగు వరుసల రహదారి ఊర్లో నుండి వద్దు – బైపాస్ నుండి ముద్దు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేసే వరకు ఆందోళనలు విరమించేది లేదని స్పష్టం చేశారు.నిరాహార దీక్ష చేస్తున్న బాధితులకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య,మాజీఎంపీటీసీ కత్తుల రమేష్ యాదవ్,గ్రామ శాఖ కన్వీనర్ కాశబోయిన రాజు యాదవ్, శ్యామకూర సంపత్ రెడ్డి,నిలిగొండ దశరథం తమ మద్దతు తెలిపారు. బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాకే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ నిరాహార దీక్షలో కార్యక్రమంలో ఉల్లెంగుల తిరుపతి, బాలరాజు, గుగ్గిళ్ళ వేణుమాధవ్, రాజిరెడ్డి, అంజయ్య, తిరుపతి, వెన్నయ్య, వెంకటి, లక్ష్మి, రవీందర్, స్వర్ణ, కనకవ్వ, రజిత,పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, బాధితులు పాల్గొన్నారు

# రాయలసీమకు బిగ్ ప్రాజెక్ట్..

**- రూ.లక్ష కోట్ల హార్టికల్చర్ హబ్**
**మదనపల్లె వేదికగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్**
**10 జిల్లాలు.. 201 క్లస్టర్లతో భారీ ప్రణాళిక**
**రూ.40,352 కోట్ల ప్రభుత్వ నిధులతో పనులు**
**9.6 లక్షల మంది రైతులకు ప్రయోజనం**



**ముద్ర, హైదరాబాద్ :** రాయలసీమ ప్రాంతపు రాతను మార్చి, ఉద్యాన రైతులకు విత్తనం వేసే దశ నుంచి విదేశాలకు పంటలను ఎగుమతి చేసే వరకు కొండంత అండగా నిలిచే ప్రతిష్టాత్మక 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం అంకురార్పణ చేయనుంది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఉదయం 11 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొని ఈ బృహత్తర అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించనున్నారు. మూడు దశల్లో రూ.1 లక్ష కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వ 'పూర్వోదయ' పథకం ద్వారా రూ.40,352 కోట్ల నిధులను సమకూరుస్తుండగా, ప్రైవేట్ రంగం నుంచి రూ.60,000 కోట్ల పెట్టుబడులను రాబట్టేలా కూటమి ప్రభుత్వం బృహత్తర ప్రణాళిక రూపొందించింది.

**10 జిల్లాలు.. 201 క్లస్టర్లు.. ఫ్రూట్ బౌల్‌గా ఆంధ్రప్రదేశ్**

రాయలసీమ రైజింగ్‌లో భాగంగా ఉద్యాన వెలుగులు నింపేలా ప్రారంభమవుతున్న ఈ హబ్ పరిధిలోకి అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, తిరుపతి, వైఎస్సార్ కడప జిల్లాలతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాలు కూడా రానున్నాయి. మొత్తం 10 జిల్లాల్లోని 303 మండలాలు, 5,869 గ్రామాల్లో 201 క్లస్టర్లుగా వర్గీకరించి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పనులను చేపట్టనున్నారు. ఇప్పటికే దేశంలో 'రైస్ బౌల్' గా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌ను, ఈ ప్రాజెక్టు ద్వారా 'ఫ్రూట్ బౌల్' గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉన్న హార్టికల్చర్ సాగును మరో 6 లక్షల హెక్టార్లకు విస్తరించి మొత్తం 14.41 లక్షల హెక్టార్లకు పెంచనున్నారు. అలాగే 222 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న వార్షిక ఉద్యాన ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏకంగా 435 లక్షల మెట్రిక్ టన్నులకు తీసుకెళ్లాలని ప్రభుత్వం టార్గెట్ ఫిక్స్ చేసుకుంది.

**రూ.40,352 కోట్ల ప్రభుత్వ నిధులు.. మౌలిక సదుపాయాల విస్తరణ**

రాయలసీమ హార్టికల్చర్ హబ్ పనుల్లో భాగంగా భారీ ఎత్తున ఇరిగేషన్ ప్రాజెక్టుల అభివృద్ధి, డ్రిప్ ఇరిగేషన్, కనెక్టివిటీ రహదారులు, లాజిస్టిక్స్ రంగాన్ని వేగవంతంగా విస్తరించనున్నారు. ప్రభుత్వం వెచ్చించే రూ.40,352 కోట్ల నిధుల్లో ఒక్క నీటిపారుదల రంగానికే రూ.20,884 కోట్లు కేటాయించగా, ఉద్యాన రంగాభివృద్ధికి రూ.15,000 కోట్లు, రహదారుల నిర్మాణానికి రూ.4,562 కోట్లను ఖర్చు చేయనున్నారు. కొత్తగా 9 లక్షల ఎకరాలకు ఆయకట్టు సౌకర్యాన్ని కల్పించడంతో పాటు, 4.3 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే చర్యలు చేపట్టనున్నారు. దీనివల్ల సుమారు 9.6 లక్షల మంది ఉద్యాన రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. మామిడి, అరటి, టమోటా, దానిమ్మతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బెర్రీస్ వంటి అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగును ప్రోత్సహిస్తూ, ఆయా ఉత్పత్తులకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించనున్నారు.

**ఆరు నెలల శ్రమ.. కేంద్రంతో సుదీర్ఘ సంప్రదింపులు**

ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రూపుదిద్దుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఆరు నెలలుగా సుదీర్ఘమైన కసరత్తు చేశారు. వ్యవసాయ, ఉద్యాన, ఆర్థిక, నీటిపారుదల తదితర కీలక శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు.

కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి 'పూర్వోదయ' పథకం కింద భారీగా నిధులను సాధించడంలో విజయం సాధించారు. రేపు ఉదయం మదనపల్లె వేదికగా ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్టు, రాయలసీమ ప్రాంత సాగునీటి, ఉద్యాన రంగాల రూపురేఖలను శాశ్వతంగా మార్చివేసి రైతుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## కలబంద జెల్‌తో ఉపశమనం

తాజా కలబంద జెల్‌ను ముఖానికి రాసి మెల్లగా మసాజ్ చేయాలి. అరగంట తర్వాత కడిగేయవచ్చు. క్రమం తప్పకుండా ఉపయోగిస్తే ట్యాన్ తగ్గించుకోవడంలో సహాయపడుతుంది.




### ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను రక్షించేందుకు

# యువత ముందువరుసలో ఉండాలి

**జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**విపత్తులపై పూర్తి అవగాహనతో సిద్ధంగా ఉండాలి**




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను రక్షించేందుకు యువత ముందువరుసలో ఉండాలని, విపత్తులపై పూర్తి అవగాహనతో సిద్దంగా ఉండాలని జిల్లా స్థానిక అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం ఆక్షన్‌ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మి నరసింహ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు ప్రకృతి విపత్తుల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరదలు, భూకంపాలు, తుఫానులు, అగ్ని ప్రమాదాలు తదితర విపత్తులు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సంభవిస్తున్నాయని తెలిపారు. విపత్తుల కారణంగా ప్రాణ, పంట, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉంటుందని, ఇలాంటి పరిస్థితుల్లో తోటివారిని కాపాడేందుకు యువత సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ దిశగా ఆక్షన్‌ఎయిడ్ సంస్థ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అదనపు కలెక్టర్ సూచించారు.జిల్లా ఫైర్ డిపార్ట్మెంట్ అధికారి మధుసూదన్ రావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల కారణంగా చెట్లు, నివాస ప్రాంతాలు దగ్గం కావడంతో పాటు కొన్ని సందర్భాల్లో ప్రాణ నష్టం కూడా సంభవిస్తుందని తెలిపారు. అగ్ని ప్రమాదాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అగ్నిమాపక శాఖ నిరంతరం సేవలందిస్తోందని, అదే సమయంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.భువనగిరి ఫైర్ స్టేషన్ అధికారి మధుకర్ అగ్ని ప్రమాదాల నివారణ, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు అగ్నిమాపక పరికరాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు.మెడికల్ ఆఫీసర్ విజయ్ ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ (CPR) నిర్వహించే విధానాన్ని ప్రదర్శన ద్వారా వివరించారు.ఈ కార్యక్రమాన్ని ఆక్షన్‌ఎయిడ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఇర్ఫాన్ సమన్వయం చేయగా, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ ప్రారంభ సందేశం అందించారు.కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ డిఫెండర్ సురుపంగ శివలింగం, సిటిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగారం శంకర్, పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ సభ్యులు భానోతు భాస్కర్ నాయక్, దేశపాండ్య భారత్, ఎల్ఆర్‌పీ ప్రతినిధులు జె. కవిత, టి. చంద్రకళ, జి. శోభారాణి, టి. శిరీష, మమత, కళాశాల అధ్యాపకులు, ఫైర్ సిబ్బంది తదితరులతో పాటు సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను గుర్తించడంలో కాలయాపన ఎందుకు?

**టీఎంయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్**



**ముద్ర, వలిగొండ:** త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో త్యాగాలు చేసిన ఉద్యమకారులను గుర్తించడంలో కాలయాపన ఎందుకు జరుగుతుందో చెప్పాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు. ఉద్యమకారుల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులను గుర్తించడం ఆలస్యమే అయితే ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని అలాకాకుండా ఉద్యమకారులను గుర్తించి ఉద్యమకారుల ఆశీస్సులతో మరోసారి అధికారంలోకి రావాలని అన్నారు. ప్రభుత్వం వేసిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ అన్ని సంఘాల తోటి అన్ని రాజకీయ పార్టీల తోటి సంప్రదింపులు జరిపి మూడు నెలలు అవుతున్నప్పటికీ నేటి వరకు ఎందుకు కాలయాపన చేస్తుందో అర్థం కావడం లేదు అన్నారు. రాష్ట్రం కోసం తమ సర్వస్వాన్ని ధార పోసిన ఉద్యమకారులు రక్తాన్ని చిందించి స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులకే అన్యాయం చేస్తే చరిత్ర క్షమించదని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను గుర్తించి చరిత్ర తిరగరాయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంగిశెట్టి జనార్దన్ కొండాపురం శ్రీనివాస్ గడ్డమీది పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పాక పుల్లయ్య మృతి

**ముద్ర, వలిగొండ:** మండలంలోని లోతుకుంట గ్రామానికి చెందిన బిజెపి నాయకులు మాజీ సర్పంచ్ పాక పుల్లయ్య బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ సీనియర్ నాయకులు పాశం భాస్కర్ అంతిమయాత్రలో పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించారు పాక పుల్లయ్య మృతి బాధాకరమని అన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ కొప్పుల యాదిరెడ్డి నాయకులు బంధారపు లింగస్వామి రాచకొండ కృష్ణ అశోక్ రెడ్డి రామ్ నర్సు హరికృష్ణ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**ముద్ర, వలిగొండ:** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని సుంకిశాల గ్రామంలో చెరుకు ముత్తయ్య, నల్ల రంగయ్య, రాగిరు ముత్యాలుకు గ్రామ శాఖ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గ్రామ శాఖ అధ్యక్షులు పోలేపల్లి వీరస్వామి, తుమ్మల సత్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహ పోలేపల్లి స్వామి,బాలకృష్ణ, బాల నరసింహ, అశోక్, ఇంజమూరి రమేష్, ఎస్.కె చాంద్బాషా వేముల మల్లయ్య, దేశపాక సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, సివిల్ సప్లైస్, వ్యవసాయ, సహకార, మెప్మా తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ జిల్లా లో జిల్లాలో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లాలో 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, తూకం పరికరాలు తదితర సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గన్నీ బ్యాగుల కొరత, ధాన్యం రవాణాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లైస్ డీఎం హరికృష్ణ, సివిల్ సప్లైస్ అధికారి రోజారాణి తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**డీఎస్పీ రవీందర్**

**భువనగిరి పట్టణంలో ఫ్లాష్ వాక్, ప్రజా ప్రతిజ్ఞ**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీస్పీ రవీందర్ పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాల్లో భాగంగా ఫ్లాష్ వాక్, ప్రజా ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్పి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఓటీపీ, పిన్, సి వి వి, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, నకిలీ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు కలిసి సైబర్ నేరాల నివారణ, వ్యక్తిగత సమాచార భద్రత, డిజిటల్ సురక్షిత వినియోగంపై ప్రజా ప్రతిజ్ఞ చేశారు."ఆలోచించి క్లిక్ చేయండి – ధృవీకరించి స్పందించండి – సురక్షితంగా ఉండండి" అనే సందేశంతో సైబర్ భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పట్టణ సీఐ రమేష్, రూరల్ సీఐ చంద్రబాబు, ఎస్ ఐ లు అనిల్, లక్ష్మీనరసయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ముద్ర, దేవరకొండ:** రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సీఐ నవీన్ కుమార్ , ఎస్సై అజ్మీర రమేష్ లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం గురువారం కొండమల్లేపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అవగాహన ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. సదస్సులో వివిధ పార్టీల నాయకులు, వాహనదారులు, డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు

## ఘనంగా సామూహిక సీమంతాలు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 1 :** పోషణ మాసం వారోత్సవాల్లో భాగంగా గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ భద్రమ్మ, మాజీ కార్పొరేటర్లు శీలంశెట్టి వీరభద్రం, రాపర్తి శరత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు రోజూ తీసుకోవాల్సిన పోషకాహారం, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సాంప్రదాయబద్ధంగా గాజులు, చీర, సారె అందించి ఆశీర్వదించారు. పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు చిన్నారుల్లో అంగవైకల్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని స్పష్టం చేశారు.సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు ఖమ్మంలో ఈ పోషణ మాసం వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, టీకాలు, మందులపై ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని పేర్కొన్నారు.




## ఘనంగా తిరుప్పావడ సేవ

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ మదన వేణుగోపాల స్వామి వారికి ఉదయం నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. ఘనంగా తిరుప్పావడ సేవ నిర్వహించారు. స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది.అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని,లడ్డు,వడ,తదితర పిండివంటలను నైవేద్యం చేస్తారు. వేదమంత్రోచ్ఛారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు.

- ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి



## హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతి కుమార్ డిమాండ్ చేశారు. హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆయన ఈ మేరకు ప్రభుత్వాన్ని కోరారు.హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ ఛార్జీలను వెంటనే విడుదల చేయడంతో పాటు, విద్యార్థులకు సరైన భోజనం, బెడ్లు, పరుపులు, తాగునీరు, మరుగుదొడ్లు, దోమల నివారణకు కిటికీలకు జాలీలు వంటి మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట నూతన భవనాలు నిర్మించాలని కోరారు.అలాగే బాలుర, బాలికల హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లను నియమించి, అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు చెరుకు లక్ష్మీ సాయి , శ్యాగ జాను , నాయకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

## రూ. 205 కోట్లతో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి

**మంత్రి పొంగులేటి**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 1 :** పాలేరు నియోజకవర్గంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు 34 నెలల్లో రూ. 205 కోట్లు కేటాయించి సబ్‌స్టేషన్ల నిర్మాణం, కొత్త లైన్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీలోని తరుణి హాట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌లతో కలిసి డివిజన్ ఈఆర్‌ఓ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మంజూరైన విద్యుత్ పనుల్లో ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన భద్రాద్రి, యాదాద్రి ప్రాజెక్టులను తమ ప్రభుత్వమే పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిందని, భవిష్యత్ అవసరాల కోసం గ్రీన్ పవర్‌కు ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణను విద్యుత్ రంగంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పాలన గాలికి.. విమర్శలే సరి: పువ్వాడ



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 1 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు, విద్వేషాలు, వ్యక్తిగత దూషణలతో కాలక్షేపం చేస్తూ రాష్ట్రంలో పరిపాలనను పూర్తిగా గాలికి వదిలేశారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిరిసిల్ల సభలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుండటంతో రేవంత్ రెడ్డి తీవ్ర ఆవేశానికి, ఆక్రోశానికి గురవుతున్నారని విమర్శించారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి సమాజానికి ఆదర్శంగా నిలవాలి తప్ప, ఇలా సంస్కారహీనంగా మాట్లాడటం సరికాదన్నారు. ప్రజా సమస్యలు, తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ ముఖ్యనేతలపై దిగజారుడు వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## విజయవంతంగా ముగిసిన ఏఐకేఎంఎస్ మహాసభలు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 1:** కామ్రేడ్ అజ్మీర్ సింగ్ హాల్ లో అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ 4వ జాతీయ మహాసభలు ఘనంగా ముగిశాయి. ఫాసిస్ట్ దాడులు, కార్పొరేట్ దోపిడీ, భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కార్మికులను సంఘటితం చేస్తూ బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ మహాసభలో ఏఐకేఎంఎస్ నూతన జాతీయ అధ్యక్షుడిగా నిర్భయ్ సింగ్ దుడికే, ప్రధాన కార్యదర్శిగా జె.వి. చలపతి రావుతో పాటు 15 మంది సభ్యులతో కూడిన కేంద్ర కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతు, కూలీల ఐక్యతకు ప్రతీకగా ఎరుపు రంగు నేపథ్యంలో ఆకుపచ్చ గీత, నాగలి, కొడవలితో కూడిన నూతన జెండాను ఆమోదించారు.వ్యవసాయ రంగంలో బహుళజాతి, కార్పొరేట్ సంస్థలను నిషేధించాలని, పంటలకు మద్దతు ధరతో పాటు రుణమాఫీ అమలు చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. ఆనకట్టల నిర్మాణం, నదుల అనుసంధానానికి వ్యతిరేకంగా, రైతు, కూలీల హక్కులు, ప్రజాస్వామ్య రక్షణ, యుఎపిఎ వంటి నల్ల చట్టాల రద్దు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ పై చర్యలతో సహా 17 కీలక తీర్మానాలను ఆమోదించారు. వాలంటీర్ల అభినందనలు, అరుణోదయ బృందం విప్లవ గీతాల నడుమ ఈ మహాసభలు ముగిశాయి. ఈ వివరాలను నూతన జాతీయ నాయకత్వం వెల్లడించింది.

## వయోవృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉంది

**ముద్ర, సూర్యాపేట:** వయోవృద్ధుల హక్కులు, ఆత్మగౌరవం, ఆరోగ్య భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజ నిర్మాణంలో, జిల్లా అభివృద్ధిలో సీనియర్ సిటిజన్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. జీవితంలో కుటుంబ బాధ్యతలను నిర్వర్తించిన అనంతరం వయోవృద్ధులు మానసిక ఒత్తిడికి గురికాకుండా తమకు సంతోషాన్నిచ్చే పనులకు సమయం కేటాయించాలని సూచించారు. నడక, పుస్తకాలు చదవడం, దైవచింతన, స్నేహితులతో సమయం గడపడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని కోరారు. వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణలో నిర్లక్ష్యం చేసే ఉద్యోగులపై చర్యలు తీసుకునేందుకు సంబంధిత చట్టాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బాధిత తల్లిదండ్రులు కలెక్టర్‌ను ఆశ్రయిస్తే నిబంధనల మేరకు పిల్లల జీతం నుంచి నిర్వహణ మొత్తాన్ని తల్లిదండ్రులకు అందించే అవకాశం ఉందన్నారు.జిల్లాలో బీపీ, షుగర్ బాధితులకు క్రమం తప్పకుండా ఉచిత మందులు అందిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి కంటి, మోకాళ్ల ఆపరేషన్లతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. సూర్యాపేటలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డే కేర్ సెంటర్ సేవలను వయోవృద్ధులు వినియోగించుకోవాలని సూచించారు. వారి రేషన్ కార్డులు, ఇతర స్థానిక సమస్యల పరిష్కారానికి పంచాయతీ, మున్సిపల్ యంత్రాంగం సహకరిస్తుందని హామీ ఇచ్చారు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి. రామారావు, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్‌డీఓ సన్యాసి, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## శనగపిండి–పసుపుతో ఫేస్ ప్యాక్

శనగపిండిలో చిటికెడు పసుపు, పెరుగు లేదా పాలు కలిపి పేస్ట్‌గా చేసుకోవాలి. ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల తర్వాత మెల్లగా స్క్రబ్ చేస్తూ కడిగేయాలి.




# పీఎం కుసుమ్-ఏలో 100 మెగావాట్ల మైలురాయి

**18 సర్కిళ్లలో సౌర విద్యుత్ విస్తరణకు కీలక ముందడుగు**
**3–4 నెలల్లో 300 మెగావాట్ల సౌర విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం**

**ముద్ర, హైదరాబాద్:** పీఎం కుసుమ్–ఏ పథకం కింద టీజీ ఎస్పీడీసీఎల్ మరో కీలక మైలురాయిని సాధించింది. సంస్థ పరిధిలోని 18 సర్కిళ్లలో కలిపి 100 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించినట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు.రైతుల భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తితో పాటు రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించడమే పీఎం కుసుమ్–ఏ పథకం ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.



రైతులు తమ భూముల్లో సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, అదనంగా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసే అవకాశం ఉంటుందన్నారు. దీంతో రైతుల ఆర్థిక సాధికారతతో పాటు స్థానికంగా పునరుత్పాదక విద్యుత్ లభ్యత పెరుగుతుందని తెలిపారు.18 సర్కిళ్లలో పథకం అమలుకు కృషి చేసిన అధికారులు, ఇంజినీర్లు, సిబ్బందిని సీఎండీ అభినందించారు. సౌర విద్యుత్ సామర్థ్యాన్ని మరింత వేగంగా విస్తరించేందుకు చర్యలు కొనసాగించాలని సూచించారు.ప్రస్తుతం మరో 200 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యం వివిధ దశల్లో ఉందని, రానున్న 3 నుంచి 4 నెలల్లో మొత్తం 300 మెగావాట్ల సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వరుణ్ రెడ్డి తెలిపారు.సౌర విద్యుత్ విస్తరణతో రైతులకు అదనపు ఆదాయం, వినియోగదారులకు పర్యావరణహిత విద్యుత్, సంస్థకు పునరుత్పాదక ఇంధన సామర్థ్య విస్తరణ అనే మూడు ప్రధాన ప్రయోజనాలు చేకూరుతాయని ఆయన పేర్కొన్నారు.

# ఎగుమతిదారుల కోసం కస్టమ్స్ పథకాలపై ఎఫ్ఐఈఓ కార్యక్రమం

**అక్టోబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహణ**

**ముద్ర, హైదరాబాద్:** ఎగుమతిదారులు, తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, వాణిజ్య భాగస్వాములకు కస్టమ్స్ పథకాలు, సులభతర విధానాలపై అవగాహన కల్పించేందుకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈఓ) కార్యక్రమాన్ని నిర్వహించనుంది. "ఎగుమతిదారుల కోసం కస్టమ్స్ పథకాలు: ప్రయోజనాలు, విధానాలు, నిబంధనలు" పేరుతో ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో అక్టోబర్ 9న హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం జరగనుంది.ఎగుమతిదారులకు అందుబాటులో ఉన్న కస్టమ్స్ పథకాల ప్రయోజనాలు, అర్హత, దరఖాస్తు విధానం, డాక్యుమెంటేషన్, నిబంధనలపై కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నారు. ఐస్‌గేట్, ఎలక్ట్రానిక్ కస్టమ్స్ విధానాలు, రిస్క్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఫేస్‌లెస్ అసెస్‌మెంట్, కస్టమ్స్ సులభతర విధానాలు, ఎగుమతుల ప్రోత్సాహంలో కస్టమ్స్ పాత్రపై చర్చలు జరుగుతాయి.అడ్వాన్స్ ఆథరైజేషన్, డ్యూటీ ఫ్రీ ఇంపోర్ట్ ఆథరైజేషన్, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ క్యాపిటల్ గూడ్స్ (ఈపీసీజీ) పథకాలు, బాండెడ్ తయారీ, వేర్‌హౌసింగ్, బాండ్, ఎల్‌యూటీ ద్వారా ఎగుమతులు, ఏఈఓ వంటి అంశాలను కూడా వివరించనున్నారు. షిప్పింగ్ బిల్లు, వర్గీకరణ, వాల్యుయేషన్, రికార్డుల నిర్వహణ, ఆడిట్, సాధారణ తప్పులు, జరిమానాలపై ఆచరణాత్మక అవగాహన కల్పిస్తారు.హైదరాబాద్ కస్టమ్స్ కమిషనరేట్‌కు చెందిన సీనియర్ అధికారులు వివిధ అంశాలపై ప్రెజెంటేషన్లు ఇవ్వడంతో పాటు కస్టమ్స్ విధానాలు, నిబంధనలకు సంబంధించిన ఆచరణాత్మక సమస్యల పరిష్కారంపై చర్చిస్తారు. బ్యాంకు అధికారులు కూడా పాల్గొని ఎగుమతిదారులకు అందుబాటులో ఉన్న ఆర్థిక అవకాశాలను వివరిస్తారు. డిజిటల్ కస్టమ్స్, ఐస్‌గేట్ సేవలపై కేస్‌స్టడీలు, ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమం ద్వారా కస్టమ్స్ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అవసరమైన విధానాలు, డాక్యుమెంటేషన్‌పై ఎగుమతిదారులకు స్పష్టమైన అవగాహన కల్పిస్తామని ఎఫ్ఐఈఓ డైరెక్టర్ జనరల్ ఉన్నికృష్ణన్ తెలిపారు.మరిన్ని వివరాల కోసం ఎఫ్ఐఈఓ తెలంగాణ చాప్టర్ హెడ్ ఆర్. కులకర్ణిని 9848286640 నంబర్‌లో లేదా kulkarni@fieo.org ద్వారా సంప్రదించవచ్చు.ఎఫ్ఐఈఓ గురించి: వాణిజ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 1965లో ఏర్పాటైన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ ఎగుమతిదారుల కోసం మార్కెట్ పరిశోధన, వాణిజ్య సమాచారం, ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాలు, విదేశీ వాణిజ్య ప్రదర్శనలు, శిక్షణ, విధానపరమైన సిఫార్సులు వంటి సేవలను అందిస్తోంది.

# శేరిలింగంపల్లిలో రూ.79.58 కోట్లతో నాలాల విస్తరణ

**వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు**
**పనులను వేగంగా పూర్తి చేయాలి**
**పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**ముద్ర, హైదరాబాద్:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా రూ.79.58 కోట్ల అంచనా వ్యయంతో నాలాల విస్తరణ పనులు చేపడుతున్నట్లు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. చందానగర్ డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య కాలనీలో పటేల్ చెరువు అలుగు నుంచి గంగారం చెరువు వరకు చేపడుతున్న నాలా విస్తరణ పనులను ఆయన SNDP ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ పనుల్లో భాగంగా రూ.18.92 కోట్లతో నిర్మిస్తున్న RCC బాక్స్ డ్రైన్, RCC బెడ్, సైడ్‌వాల్స్, నాలా విస్తరణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ప్రతి వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గాంధీ తెలిపారు. భవిష్యత్తులో వరద సమస్య పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నాలాల విస్తరణతో లోతట్టు, ముంపు ప్రాంతాల ప్రజలకు ఉపశమనం లభిస్తుందన్నారు.నాలా నిర్మాణ సమయంలో నీటి ప్రవాహం సాఫీగా సాగేలా సరైన లెవల్స్ నిర్ధారించాలని, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. పనుల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అసంపూర్తిగా ఉన్న నాలా విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకూడదని స్పష్టం చేశారు. పనుల సందర్భంగా ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సహకరిస్తానని తెలిపారు.కార్యక్రమంలో SNDP ఇంజినీరింగ్ విభాగం డీఈ శివసాయి, ఏఈ నిఖిల్, నాయకులు మారబోయిన రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అక్బర్ ఖాన్, చింతకింది రవీందర్ గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## వ్యక్తి దారుణ హత్య



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** గుర్తుతెలియని వ్యక్తులు ఒక వ్యక్తిని దారుణంగా చేశారు. ఎక్కడో చంపి మృతదేహాన్ని తీసుకొచ్చి ఇక్కడ పడేశారు అని అనుకున్న, అక్కడ ఆధారాలను బట్టి ఇక్కడే తెలిసిన వారు హత్య చేసి ఉంటారని పోలీసులు అంచనాకి వచ్చారు. ఈ సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం....నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోకాపేట నియో పోలీస్ వద్ద గురువారం ఉదయం మృతదేహం లభ్యం అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు ఒకటి చేరుకొని ఎక్కడో హత్య చేసి పడేసినట్లుగా అనుమానం వ్యక్తం చేశారు. మృతుని జేబులో ఉన్న ప్రకారం ఖమ్మం కు చెందిన వెంకన్నగా పోలీసులు గుర్తించారు.క్రికెట్ బ్యాట్ తో తలపై దాడి చేసి హత్య చేశారని పోలీసులు నిర్ధారించారు. మిత్రుడు కోకాపేట్ లో ఉంటూ ఉస్మానియా క్యాంపస్ లో పీహెచ్‌డీ చదువుతున్నాడు.మృతుడికి భార్య , ఇద్దరు పిల్లలు ఉన్నారు.హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## జేఎన్‌టీయూహెచ్ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

**ఎస్పీఎఫ్ డిమాండ్**

**ముద్ర, కూకట్‌పల్లి:** జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ హైదరాబాద్‌లోని బాలుర, బాలికల హాస్టళ్లలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.వి. నరసింహ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు సుజయ్ దార్ల, దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ... హాస్టళ్లలో తాగునీటి ఫిల్టర్లు సరిగా పనిచేయకపోవడం వల్ల అపరిశుభ్రమైన నీరు సరఫరా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కారిడార్లు, బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించకపోవడం, కొన్ని టాయిలెట్లు అసలు పనిచేయకపోవడం, తగినంత నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పారిశుద్ధ్య లోపం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా, కొన్ని గదుల్లో పరిమితికి మించి అధిక సంఖ్యలో విద్యార్థులను కేటాయించడం, స్టడీ హాళ్లలో కుర్చీలు, టేబుళ్లు, సరైన లైటింగ్ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంపై అభ్యంతరం తెలిపారు. హాస్టల్ భోజనం నాణ్యతపై కూడా విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు.అధికారులు వెంటనే అన్ని హాస్టళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను గుర్తించాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, క్రమమైన నీటి సరఫరాతో పాటు స్టడీ హాల్ సౌకర్యాలను తక్షణమే పునరుద్ధరించాలని SPF నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు హేమంత్ సిద్ధార్థ, రాజు కుమార్, వసంత్ నాయక్, అక్షిత్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ముగిసిన వేద శాస్త్ర ప్రవర్ధక సభ దశాబ్ది ఉత్సవాలు

**ముద్ర, హైదరాబాద్:** దక్షిణామ్నాయ శృంగేరి జగద్గురువుల పరిపూర్ణ అనుగ్రహ ఆశీస్సులతో తెలంగాణ వేద శాస్త్ర ప్రవర్ధక సభ ఆధ్వర్యంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన 10వ చతుర్వేద సదస్సు, సామవేద హవనం, గాయత్రీ హవనం హైదరాబాద్‌లోని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్, గోపన్‌పల్లిలో జరిగాయి.తెలంగాణలో వైదిక విద్యకు సాధికారత కల్పించడం, స్వాభిమానాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ సంస్థ గత పదేళ్లుగా వేద పరీక్షలను అత్యుత్తమ ప్రమాణాలతో నిర్వహిస్తోంది. సుమారు 10 రాష్ట్రాల నుంచి వివిధ శాఖలకు చెందిన వేద విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరై, సముచిత పత్రాలను పొందు తున్నారు. కేవలం వేద పరీక్షలకే పరిమితం కాకుండా స్మార్త, శాస్త్ర సభలను కూడా నిర్వహించడం ఈ కార్యక్రమాల ప్రత్యేకతగా నిలిచింది. తిరుమల, కాశీ, శృంగేరి, కంచి వంటి ప్రముఖ సంస్థానాలకు చెందిన ఆస్థాన విద్వాంసులు, పరీక్షాధికారులు, పండితులు పాల్గొన్నారు. దీంతో సభ గొప్ప పండిత సమ్మేళనంగా నిలిచింది. దశాబ్ది ఉత్సవాల్లో పలువురు విద్వాంసులను సన్మానించడంతో పాటు, పరీక్షలు పూర్తి చేసి పాఠశాలల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులకు భవిష్యత్ విద్య, మార్గదర్శనంపై సూచనలు అందించారు.తెలంగాణ ప్రాంతంలో తెలంగాణ వారిచే నిర్వహించబడుతున్న ఏకైక వైదిక వేద శాస్త్ర ప్రవర్ధక సభగా, వేద పరీక్షలు నిర్వహించి సముచిత పత్రాలను అందించే సంస్థగా గత పదేళ్లుగా సభ అవిరళ కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర శృంగేరి ప్రతినిధి వి. రాధాకృష్ణ శర్మ అధ్యక్షతన, రాచర్ల రవిచంద్ర శర్మ, చెబియం రాఘవ శర్మల నేతృత్వంలో పలువురు వేద విద్వాంసుల సహకారంతో ఈ సభలు నిర్వహించారు. సెప్టెంబర్ 29న ప్రారంభమైన దశాబ్ది ఉత్సవాలు అక్టోబర్ 1న హవన పూర్ణాహుతి, పట్టా ప్రదానం, పండిత సన్మాన కార్యక్రమాలతో ముగిశాయి.




## రూ.7.04 కోట్ల పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణంలో వివిధ వార్డుల్లో మొత్తం రూ 7.04 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు గురువారం శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లు, డ్రైన్ల పనులు ఇందులో ఉన్నాయి.వార్డుల వారీగా... 4లో రూ.70 లక్షలు, 17, 18, 19లో రూ.53 లక్షలు, 5లో రూ 70 లక్షలు, 6, 7, 8లో రూ.40 లక్షలు, 8లో రూ 30 లక్షలు, రూ.2 కోట్లతో రాందాస్ చౌరస్తా, అంబేద్కర్ సర్కిల్, ధ్యాన్ చంద్ చౌరస్తాల అభివృద్ధి, జంక్షన్ల మెరుగు పరచడం. 32లో రూ.10 లక్షలు, 29లో రూ.20 లక్షలు, 25లో 30 లక్షలు, 26లో రూ.26 లక్షలు, 9లో 85 లక్షలతో పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కమీషనర్ నవీన్, టౌన్ అధ్యక్షుడు ఎం. గంగాధర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోగుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

**కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య సంస్థలలో వైద్య సంస్థల చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు.ఆసుపత్రుల్లో రోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, అగ్ని ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు తదితర అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య సంస్థల చట్టం అమలు, అగ్ని ప్రమాదాల నివారణ, రోగులకు భద్రత ఉంచాలన్నారు.నివాస అవసరాల కోసం నిర్మించిన భవనాల్లో నిర్వహిస్తున్న ఆసుపత్రులను ప్రత్యేకంగా పరిశీలించి, ఆసుపత్రుల నిర్వహణకు అవసరమైన భద్రతా ప్రమాణాలు, అగ్ని ప్రమాదాల నివారణ ఏర్పాట్లు, అత్యవసర సేవలు, విద్యుత్ భద్రత తదితర సదుపాయాలు నిబంధనల మేరకు ఉన్నాయా లేదా నిర్ధారించాలని ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

**రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాలు పూర్తి చేయాలి**

రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలను పూర్తిచేయాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. రెండవ విడతలో ఇంకా మిగిలి ఉన్న అర్హత గల ఇందిరమ్మ గృహ నిర్మాణాలలో సరైన లబ్ధిదారులను గుర్తించి, లబ్ధిదారుల దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలన్నారు. మొదటి విడతలో మంజూరై నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసి లబ్దిదారులు త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా సంబంధిత ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారుప్రతి నియోజవర్గానికి 1500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో గుడిసెలు, రేకుల ఇండ్లు, మట్టితో ఉన్న వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు.రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలు గృహరహిత కుటుంబాలు అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందన్నారు. హౌసింగ్ పీడీ మాణిక్యం, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, తహసిల్దార్లు, హౌసింగ్ ఏఈ, డిఈలు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ భారత్ ఉద్యమం

**పరిశుభ్రత నిరంతర బాధ్యత**
**పీఐబీ హైదరాబాద్ ఏడీజీ శ్రుతి పాటిల్**

**ముద్ర, హైదరాబాద్:** స్వచ్ఛ భారత్ మిషన్ ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్న ఉద్యమమని పీఐబీ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ తెలిపారు. పరిశుభ్రత ఒక్కరోజు కార్యక్రమానికి పరిమితం కాకుండా ప్రతిరోజూ కొనసాగించాల్సిన బాధ్యత అని పేర్కొన్నారు."స్వచ్ఛతా మే సహభాగ్–స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్" ఇతివృత్తంతో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా–2026లో భాగంగా గురువారం కవాడిగూడలోని సీజీఓ టవర్స్‌లో "ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్" శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఐబీ, సీబీసీ హైదరాబాద్ అధికారులు, సిబ్బంది ఇందులో పాల్గొని సీజీఓ టవర్స్ పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా శ్రుతి పాటిల్ మాట్లాడుతూ పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీజీఓ టవర్స్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను ఆమె అభినందించారు. వారి సేవలకు గుర్తింపుగా గ్లౌవ్స్, శానిటేషన్ కిట్లను అందజేశారు.అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా సీజీఓ టవర్స్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ నూతన కమిటీ నియామక పత్రాల అందజేత



**ముద్ర, కూకట్‌పల్లి :** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గానికి సంబంధించి నూతనంగా నియమితులైన పలువురు నాయకులకు ఈరోజు నియామక పత్రాలను అందజేశారు. కూకట్‌పలి కాంగ్రెస్ పార్టీ కార్యాలయమైన శ్రీ హేమ దుర్గా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ చేతుల మీదుగా నూతన బాధ్యులకు పత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఎస్సీ వర్గాల సంక్షేమానికి మరియు పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎస్సీ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు మరియు కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L. N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555